నల్లగొండ వార్త
నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి
సోమవారం 29, జనవరి 2024 16 పేజీలు







## రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారు
- లింగగిరి చెరువుకు లిఫ్ట్ ఏర్పాటు చేయిస్తా
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



16లో...

## తయారీకి నోచుకోని
# సేంద్రీయ ఎరువులు

- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
- గ్రామపంచాయితీలకు సమకూరని ఆదాయ వనరులు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1740 గ్రామపంచాయితీలు



ప్రభాతవార్త, సూర్యాపేట : గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తడి, పొడి చెత్త వేరు చేసేందుకు గాను సెగ్రిగేషన్ షెడ్లను మంజూరు చేసి నిర్మాణం చేపట్టింది. గ్రామాల్లో ఎక్కడా చెత్త కనిపించకుండా ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డులకు చేర్చి సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్తలను వేరు చేసి కంపోస్టు ఎరువులను తయారు చేసి గ్రామపంచాయితీలకు ఆర్థిక వనరులు సమకూర్చేలా చర్యలు చేపట్టింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో మాత్రమే సేంద్రీయ ఎరువులను తయారు చేస్తున్నారు. ఎక్కువ గ్రామాల్లో నిరుపయోగంగా ఉంటున్నాయి. సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణ ఉద్దేశ్యం మంచిదైనప్పటికీ ఆచరణలో కార్యరూపం దాల్చకపోవడంతో లక్ష్యం దెబ్బతింటుంది. గ్రామాలు, పట్టణాల్లో సైతం వీటిని నిర్మించారు. తడి, పొడి చెత్త వేరు చేసేందుకు ఇంటింటికి బుట్టలు కూడా అందజేశారు.

2వ పేజీలో...

## జిల్లాల, మండలాల పునః పరిశీలనకు ప్రత్యేక కమిషన్



- అస్తవ్యస్తంగా జిల్లాల ఏర్పాటు
- తాగునీటి కోసం ప్రణాళిక
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గరిడేపల్లి జనవరి 28 ప్రభాతవార్త : రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలు, మండలాలను అస్తవ్యస్థంగా ఏర్పాటు చేసినందున పునః పరిశీలన కోసం ప్రత్యేక కమీషన్ ప్రభుత్వం ఏర్పాటుచేస్తుం దని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకలలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ గత ప్రభుత్వం నియోజకవర్గం ఒక జిల్లాలో లేదని, ఒక్కొక్క నియోజకవర్గం రెండు, మూడు జిల్లాలలో కలిసి ఉందని, కొన్ని జిల్లాలు పెద్దవిగా, కొన్ని జిల్లాలు చిన్నవిగా శాస్త్రీయంగా ఏర్పాటు చేయలేదని వీటి పరిశీ లన కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటుచేసి ప్రజల సలహాలు, సూచనలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

2లో..



## డిపిఆర్ఓ వేధింపుల నుండి రక్షించండి...!

- బతిమిలాడితేనే వేతన బిల్లుపై సంతకం
- మాట వినకపోతే సరెండర్, జీతం ఆపి మెమో జారీ చేస్తా

ప్రభాతవార్త ప్రతినిధి నల్లగొండ : నల్లగొండ పౌర సంబంధాల అధికారి కిందిస్థాయి సిబ్బందిని వేధింపులు, మానసిక ఇబ్బందులకు గురి చేస్తూ, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఇతని వేధింపుల నుండి రక్షించాలని స్పెషల్ కమిషనర్ సమాచార పౌర సంబంధాల శాఖ అధికారికి ఈనెల 23న కిందిస్థాయి సిబ్బంది లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేసినట్టు తెలిసింది.

2వ పేజీలో...

## సూర్యాపేట అవిశ్వాస తీర్మానంలో
# కౌన్సిలర్ల మధ్య ఘర్షణ



- హ్యాండిచ్చిన కౌన్సిలర్ ఇంటి ముందు ఆందోళన చేసిన అసమ్మతి కౌన్సిలర్లు
- ఆందోళన చేస్తున్న కౌన్సిలర్లపై చైర్ పర్సన్, బిఆర్ఎస్ నాయకుల దాడి
- బొండపెడుతా అంటూ కౌన్సిలర్లకు చైర్‌పర్సన్ వార్నింగ్
- నేడు సూర్యాపేటలో ఆందోళనకు పిలుపునిచ్చిన కౌన్సిలర్లు

ప్రభాతవార్త ప్రతినిధి సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీ అవిశ్వాసం రెండువర్గాల కౌన్సిలర్ల మధ్య చిచ్చు పెట్టింది. అవిశ్వాసం వీగిపోవడంతో అసమ్మత్తి కౌన్సిలర్లు ఆందోళకు దిగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. అవిశ్వాసంలో నెగ్గలంటే 48మంది కౌన్సిలర్లు ఉన్న సూర్యాపేట మున్సిపాలిటీలో 32మంది కౌన్సిలర్ల మద్దతు ఉండాల్సి ఉండడంతో బిఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లతోపాటు కాంగ్రెస్, బిజేపి, బిఎస్పీ పార్టీల కౌన్సిలర్లతో మొత్తం 32మంది కౌన్సిలర్ల మద్దతుతో

9లో...

# తయారీకి నోచుకోని సేంద్రీయ ఎరువులు

మొదటి పేజీ తరువాయి

చెత్త సేకరించే విషయమై ప్రజలకు అవగాహన కూడా కల్పించారు. పకడ్బందీగా చెత్తను డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్లకు చేర్చేందుకు ప్రతి గ్రామపంచాయితీకి ఒక ట్రాక్టర్‌ను కూడా మంజూరు చేసిన సంగతి తెలిసిందే. సదరు ట్రాక్టర్ ద్వారా గ్రామాల్లో చెత్తను సేకరించి డంపింగ్ యార్డుల వద్ద కుప్పగా పోసి ఆ తరువాత తడి, పొడి చెత్తలను వేరు చేసి సేంద్రీయ ఎరువును తయారు చేసే లక్ష్యంగా గ్రామాలకు ఆదాయ వనరులను సమకూర్చుకునే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలు పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదు. జనావాసాలకు దూరంగా గ్రామ శివారులో వీటిని ఏర్పాటు చేశారు. తడి, పొడి చెత్తను ఆరబెట్టేందుకు డ్రైయింగ్ ప్లాంట్స్‌ను, స్టోర్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. పాచిపోయిన ఆహారం, కుళ్లిన కూరగాయలు, ఆకుకూరలు తడి చెత్త డబ్బాలో వేయాలి. చిత్తు కాగితాలు, తుప్పు పట్టిన వస్తువులు, కలప, ప్లాస్టిక్ తదితర వాటిని పొడి చెత్త డబ్బాలో వేయాలి. గ్రామాల్లో అవగాహన కల్పించి చెత్త డబ్బాలను కూడా పంపిణీ చేశారు. ప్రతి వార్డులో సేకరించిన తడి, పొడి చెత్తను సేంద్రీయ ఎరువుకు వినియోగించనున్నారు. పొడి చెత్తను రీసైక్లింగ్ ప్లాంట్‌కు తరలిస్తారు. తడి చెత్తను వర్మి కంపోస్టు ఎరువుగా తయారు చేసి కొద్ది రోజులు నిల్వ ఉంచి ఎరువుగా మార్చి రైతులకు విక్రయిస్తారు. అధిక గ్రామాల్లో సేంద్రీయ ఎరువులను తయారు చేయకపోవడంతో గ్రామపంచాయితీలకు ఆదాయ వనరులు తగ్గుతున్నాయి. సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. ఒక్కొక్క షెడ్‌ను రూ. 12 లక్షలు వెచ్చించి నిర్మించారు. నల్లగొండ జిల్లాలో 844 గ్రామపంచాయితీలు, సూర్యాపేట జిల్లాలో 475 గ్రామపంచాయితీలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 421 గ్రామపంచాయితీలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1740 గ్రామపంచాయితీలు ఉన్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామపంచాయితీ సర్పంచ్‌లను కంపోస్టు ఎరువు తయారు చేయాలని ఆదేశిస్తున్నారు. ట్రాక్టర్‌తో పాటు నీళ్ల ట్యాంకర్‌ను కూడా గ్రామపంచాయితీల్లో అందుబాటులో ఉంచారు. పారిశుధ్య సిబ్బంది సరిపడా లేకపోవడంతో ఈ ఎరువును తయారు చేయలేకపోతున్నామని పలువురు సర్పంచ్‌లు సమావేశాల్లో అధికారులకు తెలియజేశారు. గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా గ్రామపంచాయితీ పారిశుధ్య కార్మికులు లేరు. ఏ గ్రామంలో చూసినా జనాభాకు అనుగుణంగా నలుగురు, ఐదుగురు గ్రామపంచాయితీ కార్మికులు పనిచేస్తున్నారు. ఎక్కువ శాతం మంది మల్టీపర్పస్ కార్మికులుగా పనిచేస్తూ తక్కువ వేతనాన్ని పొందుతున్నారు. నెలకు రూ. 8500 మాత్రమే చెల్లిస్తుండడంతో మల్టీపర్పస్ వర్కర్లుగా పనిచేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. నెలవారీగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఉన్న వారు కూడా వెళ్లిపోతున్నారు. దీంతో కంపోస్టు ఎరువును తయారు చేయడం సర్పంచ్‌లకు ఇబ్బందిగా మారింది. నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు వృధాగా ఉంటున్నాయి. గ్రామపంచాయితీలకు ఆదాయ వనరులు తగ్గుతున్నాయి. కంపోస్టు ఎరువు తయారీకి ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తేనే పూర్తి స్థాయిలో నిర్వహించవచ్చని పలువురు సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లో స్థలాలు లేక ఇరుకు స్థలాల్లో సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించారు. సదరు ప్రాంతాల్లో కంపోస్టు ఎరువు తయారు చేయడం ఇబ్బందిగానే ఉంది. గ్రామపంచాయితీ సర్పంచ్‌ల పదవీ కాలం ఈ నెల 31తో ముగియనుంది. ఆ తరువాత ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకోనున్నారు. సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణపై ప్రత్యేక అధికారులు ఏ మేరకు దృష్టిసారిస్తారో తెలియని పరిస్థితి. ట్రాక్టర్, నీళ్ల ట్యాంకర్, సెగ్రిగేషన్ షెడ్లు ఉండగానే సరిపోదు.

## డిపిఆర్ఓ వేధింపుల నుండి రక్షించండి...!

మొదటి పేజీ తరువాయి

ప్రతినెల వేతన బిల్లుపై సంతకం పెట్టకుండా, ఇంక్రిమెంట్లు, అత్యవసర పనిపై సెలవులు ఇవ్వకుండా నానా రకాలుగా, తమ విధులకు ఆటంకం కలిగిస్తూ గంటల తరబడి నిల్చోబెట్టి వాగ్వాదము రగడ సృష్టిస్తున్నాడని సిబ్బంది భయాందోళనకు గురవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. తనమాట వినకపోతే సరెండర్ చేస్తా, మెమో జారీ చేస్తా జీతం ఆపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు.

### బతిమిలాడితేనే వేతన బిల్లు మంజూరు..

ప్రతి నెల 28,29 తేదీల్లో వేతన బిల్లుపై సంతకం చేయకుండా గంటల తరబడి నిలబడి బతిమిలాడితేనే వేతన బిల్లు మంజూరు చేస్తారని సిబ్బంది కన్నీరు పెట్టుకున్నారు. ఈ అధికారి వద్ద మేము విధులు నిర్వహిస్తే బీపీ,షుగర్‌తో పాటు గుండె జబ్బులు, మానసిక రోగాలకు గురవుతామని ఆందోళన చెందుతున్నారన్నారు. ఆఫీసులో ముగ్గురు సబార్డినేట్ మహిళ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఈ మహిళా సిబ్బంది అందరిని రాత్రి 9 గంటల వరకు ఉండాలని హుకుం చేశారని, గత ఆరు సంవత్సరాలుగా ఈ అధికారి ఆగడాల వల్ల భరించలేకపోతున్నామని, మా కుటుంబ సభ్యులకు దూరంగా పరిస్థితి ఏర్పడుతుందని రోధించారు. నెల జీతం మీదనే ఆధారపడి బ్రతికే మా మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మేము ఈ అధికారి కింద పని చేయడం మా వల్ల కాదని పేర్కొన్నారు.

### డిపిఆర్ఓపై మంత్రి అసహనం...

తెలంగాణ రాష్ట్ర రోడ్లు,భవనాల, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంలో డిపిఆర్ఓ శ్రీనివాస్ అందుబాటు లేకపోవడంతో అసహనానికి గురైన మంత్రి డిపిఆర్ఓ శ్రీనివాసును గట్టిగా మందలించినట్లు తెలిసింది. తక్షణమే డిపిఆర్ఓపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# జిల్లాల, మండలాల పునః పరిశీలనకు ప్రత్యేక కమీషన్





మొదటి పేజీ తరువాయి

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లో తక్కువ నీటి సామర్థ్యం ఉన్నందున మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా మంచినీటి కోసం ప్రణాళిక రూపొందించి విడుదల చేయడానికి ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. పానుగోడు పాఠశాల గొప్ప చరిత్ర కలిగిన జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నిరుపేద, మధ్య తరగతి, వెనుకబడిన తరగతులు, గిరిజనులు విద్యను అభ్యసిస్తారని, ఈ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, పాఠశాలలో మరుగుదొడ్లు, నీరు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తే మౌలిక వసతులు కల్పించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మరుగుదొడ్లు, త్రాగునీటి కోసం రూ.25లక్షలు, గ్రంధాలయ అభివృద్ధికి రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలు రూపొందించలేదని సరైన సమయం చూసుకొని వీటి మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పానుగోడు గ్రామం గొప్ప చరిత్ర కలిగిందని, చైతన్యవంతమైందని అన్నారు. ప్రత్యేక మండలం ఏర్పాటు విషయం పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి సుందరి కిరణ్‌కుమార్, సర్పంచ్ జోగు సరోజన, ఎంపిటిసి వెంకటరమణ, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసిల్దార్ బండ కవిత, వజ్రోత్సవ కమిటిఅధ్యక్షుడు గన్నా లింగయ్య, కార్యదర్శి అల్లుబెల్లి లక్ష్మారెడ్డి, కోశాధికారి నక్క మట్టయ్య, ఉపాధ్యక్షులు బిల్లా కనకయ్య, సహాయ కార్యదర్శి సుందరి నాగయ్య, సమ న్వయకర్త కట్ట శ్రీను, కటికం రమేష్, సుందరి నాగేశ్వరరావు, బొలిశెట్టి లక్ష్మయ్య, జుట్టుకొండ సత్యనారాయణ, కటికం లక్ష్మీనారాయణ, అందె సత్యం, ప్రధానోపాధ్యాయులు యగడి వెంకటేశ్వర్లు, అందె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట అవిశ్వాస తీర్మానంలో కౌన్సిలర్ల మధ్య ఘర్షణ

మొదటి పేజీ తరువాయి



సూర్యాపేట చైర్ పర్సన్, వైస్ ఛైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టారు. ఇందులో చివరి నిమిషంలో బిఆర్ఎస్‌కి చెందిన 45వవార్డ్ కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ హ్యాండివ్వడంతో అవిశ్వాసం వీగింది. దీనితో అవిశ్వాసం వీగిపోవడానికి 45వ వార్డ్ కౌన్సిలర్ కారణమంటూ కౌన్సిలర్ పావని కృపాకర్ ఇంటి ముందు 31మంది కౌన్సిలర్లు ఆందోళనకు దిగారు. ఇంటిలో దుమ్మెత్తి పోసి కోడుగుడ్లతో ఇంటిపై దాడికి దిగారు. పొత్తు ధర్మం పాటించకుండా అన్యాయం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవిశ్వాస తీర్మానంపై సంతకం పెట్టి అమ్ముడుపోయారంటూ మండిపడ్డారు.ఎన్నికల ముందు మాజీ మంత్రిని తిట్టి బయటకు వచ్చిన పావని కృపాకర్ రూ.50లక్షలకు అమ్ముడుపోయి అందరి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశారని విమర్శించారు. దళిత మహిళకు ఛైర్మన్ పీఠంపై కూర్చోబెట్టి డమ్మీ ఛైర్మన్ చేశారని, వార్డులలో అభివృద్ధి కోసం ఫండ్స్ అడిగితే పట్టించుకునే పరిస్థితి లేదని వాపోయారు. ఇలాంటి ఛైర్మన్ ప్రజా సమస్యలను పరిష్కరించదన్న నిర్ణయంతో అన్నీ పార్టీల కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాసం పెట్టినట్లు తెలిపారు. కానీ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ప్రలోభాలతో అవిశ్వాసం వీగేలా చేశారని ఆరోపించారు.

### చైర్‌పర్సన్ రాకతో ఉద్రిక్తత...

31మంది కౌన్సిలర్లు ఇంటి ముందు ఆందోళన చేస్తున్న సమయంలో పావని కృపాకర్ అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పావని కృపాకర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఇంటి లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నం చేయడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు కౌన్సిలర్లను అడ్డుకున్నారు. దీనితో బయటకు రావాలంటు ఇంటి ముందు బైఠాయించారు. ఈ క్రమంలో పావని కృపాకర్‌కు మద్దతుగా అక్కడకు చేరుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణతో పాటు బిఆర్ఎస్ నాయకులు కౌన్సిలర్లతో వాగ్వాదానికి దిగారు. దీనితో అసమ్మతి కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. తోపులాటలో చైర్ పర్సన్ అన్నపూర్ణ, ఆమె అనుచరులు 31వ వార్డ్ కౌన్సిలర్ కొండపల్లి నిఖిలరెడ్డిపై దాడికి దిగడంతో ఆమె తలకు గాయాలయ్యాయి. అంతేకాకుండా కౌన్సిలర్లను బొంద పెడుతా అంటూ వార్నింగ్ ఇవ్వడంతో ఒక్కసారిగా అసమ్మతి కౌన్సిలర్లు చైర్ పర్సన్‌పై ఎదురుదాడికి దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. చైర్ పర్సన్ క్షమాపణలు చెప్పాలంటూ రెండు వర్గాలు దాడికి దిగడంతో పోలీసులు అక్కడకు చేరుకొని ఇరు వర్గాలకు నచ్చజెప్పి అక్కడి నుండి పంపించారు.

### రెండు వర్గాల కౌన్సిలర్ల ఫిర్యాదు...

రెండు వర్గాల కౌన్సిలర్ల మధ్య వివాదం తలెత్తడంతో ఇరు వర్గాల కౌన్సిలర్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటిపై దాడి చేశారని కౌన్సిలర్ పావని కృపాకర్ ఫిర్యాదు చేయగా చైర్ పర్సన్ దాడి చేశారని అసమ్మతి వర్గం కౌన్సిలర్లు బిఆర్ఎస్ నాయకులపై, చైర్‌పర్సన్‌పై ఫిర్యాదు చేశారు. దాడిలో గాయపడిన నిఖిలను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి ట్రీట్మెంట్ అందిస్తున్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిని ఆసుపత్రిలో పరామర్శించారు.

### ఛైర్మన్ పదవి ఇవ్వనందుకే అవిశ్వాస తీర్మానం ఓటింగ్ లోపాల్గొనలేదు : గండూరి పావని కృపాకర్

అగ్రవర్ణాలకు మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇవ్వడం ఇష్టం లేకనే తనకు ఛైర్మన్ పదవి ఇవ్వమని అడిగామని అందుకు నిరాకరించడంతోనే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వలేదని గండూరి పావని కృపాకర్ అన్నారు. బహుజనులకు మద్దతు ఇవ్వడానికే బిఆర్ఎస్‌లో చేరామని, ఏనాడు డబ్బుకు ఆశపడలేదని తెలిపారు. తమ ఇంటిపై దాడి అమానుష చర్యగా అభివర్ణించారు. తమ ఇంటిపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. త్వరలో బిఆర్ఎస్ నుండి తిరిగి బిఆర్ఎస్ పార్టీలో చేరతామన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారు





అధ్యాత్మికవేత్త సనాతన గురువు సధినేని యామిని శర్మ

మహిళా శక్తి సమ్మేళనం విజయవంతం

*నల్లగొండ అర్బన్, జనవరి 28, ప్రభాతవార్త:*

భారతీయ సనాతన ధర్మంలో మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారని ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలని ప్రముఖ అధ్యాత్మికవేత్త సనాతన గురువు సధినేని యామినిశర్మ పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని గుండగోని మైసయ్య కన్వెన్షన్ హాల్‌లో మహిళా శక్తి సమ్మేళనం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ రంగాలలో ప్రావీణ్యం ఉన్న మహిళలతో మహిళాశక్తి సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో 13 ప్రాంతాలలో మహిళా సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 3600 మహిళలతో మహిళా సమ్మేళనం విజయవంతమైందన్నారు. ఈకార్యక్రమ ముఖ్య ఉద్దేశం భారతీయ సనాతన ధర్మంలో మహిళలు ఏ విధంగా ఉండాలి, కాలమాన పరిస్థితుల్లో భారత రాష్ట్రపతి కూడా ఒక మహిళనే అని పేర్కొన్నారు. ప్రతిరంగంలో మహిళలు ముందున్నారని, ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలని దేశ ప్రధాని కూడా మన సనాతన ధర్మాన్ని పాటించుకుంటూ మన దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఈకార్యక్రమ నిర్వాహకురాలు నన్నూరి లతా, కత్తుల వెంకటేశం, శ్రీదేవి, కె.స్వప్న, సంధ్యారాణి, రేపాక ఉమా, మద్ది వెన్నెల రెడ్డి, రాయపుడి భవాని, ఇరుగు కోటేశ్వరి, డాక్టర్ ఇటికల సింధూర, గంట అనుష, కుక్కలకొండ అరుణ, గంజిభాగ్యలక్ష్మి, ఏచూరి శైలజ, అరుణ జ్యోతి, నూకల సంధ్యారాణి, రేపాక ఉమా, పెరిక తులసి, సత్యవతి,నిలిమారెడ్డి, అనితరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు

*నడిగూడెం, జనవరి 28 ప్రభాతవార్త*

పదవ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు మెరుగైన ఫలితాల సాధనపై దృష్టిసారించారు. ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో నవంబర్ నుండే ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. పాఠశాల సమయానికి ముందు గంట సేపు. పాఠశాల సమయం ముగిసిన అనంతరం మరో గంట సేపు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల సందర్భంగా అల్పాహారం కూడా విద్యార్థులకు అందజేస్తున్నారు. మండలంలో 13 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గురుకుల పాఠశాల, కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్‌తో పాటు మరో 10 ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు అభ్యాస దీపికలు కూడా అందజేశారు. గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం అభ్యాస దీపికలు అందజేసి మెరుగైన ఫలితాల సాధనపై దృష్టిసారించారు. గత విద్యా సంవత్సరం పలు కారణాలతో ఉత్తీర్ణత శాతం కొంత మేరకు తగ్గింది. ఈ విద్యా సంవత్సరం మెరుగైన ఫలితాలను సాధించే దిశగా ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు సైతం ప్రత్యేక తరగతులను తనిఖీ చేస్తూ పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. రోజుకొక సబ్జెక్టు వారీగా టైం టేబుల్‌ను ఏర్పాటు చేసుకుని అందుకు అనుగుణంగా ప్రత్యేక తరగతులను కొనసాగిస్తున్నారు. డిసెంబర్ 31 నాటికి సిలబస్‌ను పూర్తిగావించి రివిజన్ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు టెస్ట్‌లను నిర్వహిస్తూ పాఠ్యాంశాల వారీగా విద్యార్థుల ప్రతిభను తెలుసుకుంటున్నారు. రోజుకొక పాఠ్యాంశాన్ని రివిజన్ చేస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అల్పాహారాన్ని కూడా అందజేస్తుండడంతో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఏది ఏమైనప్పటికీ ప్రత్యేక తరగతుల నిర్వహణ ముమ్మరంగా సాగుతుంది.

## జాతీయ సేవా అవార్డు అందుకున్న మంజుల రాందాస్

*నాగార్జునసాగర్, జనవరి 28, ప్రభాతవార్త:*



రచయిత డైరక్టర్ అయినా మందుల రాందాస్ ఆదివారం హైద్రాబాదులోని రవీంద్రభారతిలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్ అర్గనేషన్ ఆధ్వర్యంలో నంది జాతీయ సేవా రత్నం అవార్డును అలనాటి సినీ హీరోయిన్ పూర్ణిమ, దైవాజ్ఞ శర్మచేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నాగార్జునసాగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ తనకు అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ అవార్డు కార్యక్రమంలో తనతో పాటుగా రఘునాథ రెడ్డి అవార్డు అందుకున్నారని తెలిపారు. గతంలోనే రవీంద్ర భారతిలో అనేక నాటికలకు డైరెక్షన్ చేశానని తెలిపారు. రచయిత డైరక్టర్ అయిన తన చేతుల మీదుగా ఎందరో కళాకారులు తయారు చేసిన ఘనత కూడా తనకుందన్నారు. ఈకార్యక్రమంలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్ సరోజ తదితరులు పాల్గొన్నారు.


## యూరియా అధిక వాడకం తగ్గించాలి

*నడిగూడెం, జనవరి 28 ప్రభాతవార్త*

మండలంలో వరి సాగు చేసిన రైతులు యూరియా అధిక వాడకం తగ్గించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. వాతావరణంలో మార్పుతో వరి ఎదుగుదల లోపించింది. దీంతో అధిక యూరియా వాడడంతో వాతావరణంలో మార్పుతో అగ్గి తెగులు సోకే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో యూరియా తక్కువ మోతాదులో వాడాలని వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర పర్యటన నిర్వహిస్తూ రైతులకు సూచనలిస్తున్నారు. యాసంగిలో వరి సాగు చేసిన రైతుల పరిస్థితి మండలంలో అధ్వాన్నంగా ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు, వాతావరణంలో మార్పుతో వరి పైర్లలో ఎదుగుదల లోపించింది. పలు రకాల తెగుళ్ల కూడా సోకుతున్నాయి. పలు గ్రామాల్లో వరి పైర్లు ఎండిపోతున్నాయి. వేల రూపాయలు ఖర్చు పెట్టి బోర్ల నిర్మాణం చేపట్టినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. భూగర్భ నీటి మట్టం అడుగంటడంతో వరి పైర్లకు సరిగా నీరందక ఎండిపోతున్నాయి. ప్రధానంగా తెగుళ్ల సోకుతున్న వరి పైర్లను కాపాడుకునేందుకు రైతులు వివిధ రకాల మందులను పిచికారీ చేస్తున్నారు. అదుపులోకి రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ యాసంగిలో వరి సాగు చేసిన రైతులు ఆశించిన దిగుబడి రాక నష్టపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## గుడిసెవాసులకు పట్టా హక్కులు కల్పించాలి

*మునగాల, జనవరి 28 ప్రభాతవార్త*



మండల కేంద్రంలో ఆదివారం ఆదివారం ప్రభుత్వం సేకరించిన భూమిలో సర్వే నెంబర్ 419లో గత ప్రభుత్వ భూమిలో ఆదివారం పేదలు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్నారు. ఈ సందర్భంగా గుడిసెవాసులు ఉద్దేశించి వ్యకాస జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు మాట్లా డుతూ అసైన్‌మెంట్ చట్టం 77 ప్రకారం పేదవాడు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే పట్టాలు కల్పించాలని చట్టం చెబుతుందన్నారు. మండల కేంద్రంలో ఏళ్ల తరబడి ఇల్లు లేక పలు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని ప్రభుత్వ భూమిలో పేదలకు ఇండ్లకు పట్టా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరావు, జిల్లా రైతు సంఘం నాయకులు దేవరం వెంకటరెడ్డి, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు సోమపంగు జానయ్య, గడ్డం వెంకన్న, కిన్నెర వెంకన్న, లంజపల్లి చిన్న వెంకన్న, సాల పిచ్చయ్య, నెమ్మాది పవన్, డాకూరి వీరబాబు, దర్శిని మైసమ్మ, పుట్టేటి మంగమ్మ, పొట్టేటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నడిగూడెం ఎస్ఐ బదిలీ

*నడిగూడెం, జనవరి 28 ప్రభాతవార్త*

నడిగూడెం స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం. ఏడుకొండలును తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఆదివారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఏడుకొండలు ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఆయన స్థానంలో ఎస్‌గా అధికారులు ఇంకా ఎవరినీ నియమించలేదు.

## నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

*కోదాడ రూరల్, జనవరి 28 ప్రభాతవార్త*



కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛంధంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధ్యక్షుడు పెదనాటి వెంకటేశ్వరరావు, సీనియర్ సిటిజన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్యలు అన్నారు. ఆదివారం హైద్రాబాద్‌లో కమ్మ వారి సేం సంఘాల సమైక్య ఆధ్వర్యంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్రంలోని నిరుపేద పిల్లలకు ఉన్నత చదువులకై స్కాలర్‌షిప్ చెక్కులను రాష్ట్ర అధ్యక్షుడు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వేమూరి సురేష్, పోటు రంగారావులు పాల్గొన్నారు.


## భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి

*నడిగూడెం, జనవరి 28 ప్రభాతవార్త*

బకాయిపడ్డ మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను చెల్లించాలని మండల సిఐటియు కన్వీనర్ మల్లెల వెంకన్న అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన నిర్వహణకు సంబంధించి బిల్లులు మంజూరు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే బిల్లులు నెలవారీగా ఇవ్వకపోవడంతో ఏజెన్సీల నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చాలీచాలని సౌకర్యాల మధ్య పథకాన్ని నిర్వహిస్తున్నారని, బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో అప్పులు తెచ్చి పథకాన్ని నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ పథకం కూడా సక్రమంగా అమలు జరగడం లేదన్నారు. బకాయిపడిన భోజన పథక బిల్లులను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు.

## సాగర్ గురుకులంలో ఎన్‌సిసి క్యాడెట్లకు పరీక్ష

**నాగార్జునసాగర్, జనవరి 28, ప్రభాతవార్త:** నాగార్జునసాగర్ బిసి గురుకులంలో ఎన్‌సిసికి క్యాడెట్లకు ఏ సర్టిఫికేట్ కొరకు పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు బిసి గురుకుల విద్యార్థులు, డిఎవి చలకుర్తి విద్యార్థులు, నవోదయ పాఠశాలకు చెందిన విద్యార్థులు మొత్తం 143 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఎన్‌సిసి కల్నల్ లచ్చారెడ్డి బిసి స్కూల్ ప్రిన్సిపల్ రజనీకాంత్, సుభేదార్ షకీలామాల్, సంతోష్ మహేష్, వెంకటేష్, పనింధ్రనాథ్, అమరలింగాచారి పాల్గొన్నారు.



# పార్లమెంటు ఎన్నికలలోపు వికలాంగుల వాటా తేల్చాలి

**చండూరు,28జనవరి,ప్రభాతవార్త:**

ఆర్టీసిలో వికలాంగులకు ఉచిత ప్రయాణం కల్పించడమో,పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి పక్ష ప్రయాణం చేయడమో సిఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ సర్కారే తేల్చుకోవాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు. ఆదివారం చండూరు మండలం కస్తాల గ్రామం లో నిర్వహించిన సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగుల సంక్షేమానికి పాటు పడతామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తుందన్నారు.రాబోయే పార్లమెంటు ఎన్నికలలోపు వికలాంగులకు పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేయకుంటే రాజీలేని పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఇచ్చిన హామి మేరకు వికలాంగులకు పెన్షన్ వచ్చే నెల నుండి 6వేలు ఇవ్వాలని,ఉచిత ప్రయాణ సౌకర్యం,21రకాల వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ, ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, నూతన వికలాంగుల హాస్టళ్లు,తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కస్తాల గ్రామ శాఖ నూతన అధ్యక్షుడు దోనాల సత్తిరెడ్డి ఆధ్వర్యంలో సంఘం మండల అధ్యక్షుడు ఆకారపు వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్యబాబు, రాష్ట్ర మహిళా



నాయకురాలు,నల్లగొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుడిపల్లి సుమతి, జిల్లా అధ్యక్షులు చిన్నపాక మత్స్యగిరి,గోగుల శేఖర్‌రెడినడ, జిల్లా మహిళా నాయకురాలు గుండెబోయిన అలివేలు, చండూరు మండల మహిళా అధ్యక్షురాలు కారింగు రేణుక, మండల ఉపాధ్యక్షులు పల్లెగోని రవి,యూత్ అధ్యక్షుడు బొమ్మరగోని శ్రీకాంత్, మునుగోడు మండల ఉపాధ్యక్షులు వంటెపాక ముత్తయ్య,మండల కార్యదర్శి ఈద పరమేష్, నాయకులు గంటెకంపు రాజశేఖర్, బండారి ఆంజనేయులు, సిరపెల్లి రాములు, సరిపెల్లి భిక్షం, గంజి విజయ, మేకల కమలమ్మ,బరిగెల యాదయ్య, ఎర్రజెల్ల ఈరమ్మ, కట్ట కృష్ణయ్య,సిద్ధు, లింగయ్య, ఎల్లమ్మ, లింగమ్మ, శేఖర్ , తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌తో ఒకరు మృతి

**మునగాల, జనవరి 28 ప్రభాతవార్త**



బ్రెయిన్ స్ట్రోక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నేలమర్రిలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నేలమర్రి గ్రామానికి చెందిన ఖాసిం దొండపాడు ఉన్నత పాఠశాల ఎఫ్ఎసి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం అకస్మాత్తుగా అనారోగ్యానికి గురి కావడంతో హైద్రాబాద్‌కు చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు, బంధుమిత్రులు ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

# ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### మాజీ ఎంపిపి రెడ్డిపల్లి, డాక్టర్ కంచర్ల హరీష్

**కట్టంగూర్,జనవరి 28,ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపిపి రెడ్డిపల్లి వెంకటమ్మసాగర్, కట్టంగూర్‌కు చెందిన జనరల్ ఫిజీషియన్ అంకాలజిస్ట్ కంచర్ల హరీష్‌లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సాందీపని పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోకి ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటుచేయడం ఎంతో అభినందనీయమని, వాటిని గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈసందర్భంగా దాదాపు 350మందికి ఉచితంగా పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. తొలుగు సాందీపని పాఠశాల



దివంగత హెచ్ఎం కనుమూరి బాలప్రదీప్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ మాధవాచారి, గైనకాలజిస్ట్ హబితా, సాందీపని హెడ్‌మాస్టర్ పోగుల రాములుగౌడ్, కానుగు లింగయ్య,డాక్టర్ నర్సింహ, తండు గిరిబాబు, వీరస్వామి, రెడ్డిపల్లి శంకర్, సిబ్బంది లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు నిర్మాణానికై ఎమ్మెల్యేకు వినతి

**డిండి, జనవరి 28,ప్రభాతవార్త**



డిండి పట్టణంలోని అంగడిబజార్‌లో సిసి రోడ్లు నిర్మించాలని కోరుతూ ఆదివారం డిండి పట్టణంలోని అంగడిబజార్‌వాసులు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డిండిలో గత యాభై సంవత్సరాలుగా ప్రతి శుక్రవారం సంత జరుగుతుందని, కానీ అక్కడ సిసి రోడ్లు లేకపోవడంతో ఇటు వ్యాపారస్తులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే చొరవ చూపాలని ఆ వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంగడి బజార్ అసోసియేషన్ నాయకులు యలకుర్తి రమేష్, సముద్రాల రమేష్, మునగపాటి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

# నేడు ఉచిత చెవి, ముక్కు గొంతు క్యాంప్

**నల్లగొండ అర్బన్, జనవరి 28, ప్రభాతవార్త:**

ఈనెల 29,30వ తేది నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో గల సంకల్ప సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత చెవి,ముక్కు, గొంతు, ఎండోస్కోపీ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు సంకల్ప సూపర్ స్పెషాలిటీ ఛైర్మన్ డాక్టర్ బి. వెంకటేశం తెలిపారు. ఆదివారం ఆసుపత్రిలో ఉచిత క్యాంప్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు, వైద్య నిపుణుడైన డాక్టర్ నాదేండ్ల చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈక్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపుకు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉచిత ఎండోస్కోపీ, కన్సల్టేషన్ కూడా ఉందన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ఆర్. శరవనన్, డాక్టర్ కరిముల్లా, డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ సాయికుమార్ రెడ్డి, డాక్టర్ రవితేజ, రమేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**కట్టంగూర్, జనవరి 28,ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివదద్ద ఉంటున్న తమ స్నేహితుని కుటుంబానికి తమవంతు ఆర్థిక సహాయం అందజేసేందుకు ముందుకు వచ్చారు తోటిమిత్రులు. వివరాల్లోకి మండలకేంద్రానికి చెందిన దోరెపల్లి మల్లిఖార్జున్ అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్దనే ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న అతని పదవ తరగతి మిత్రులు తమవంతు సాయంగా రూ.34వేల నగదును సేకరించి ఆదివారం అతనికి అందజేశారు. ఈకార్యక్రమంలో అతని పదవ తరగతి మిత్రులు పోగుల నరేష్, కంబాల నాగరాజు, మేడి మల్లిఖార్జున్, పోగుల పాండు, అబ్బగోని రాము, కాడింగు సైదులు, పలుస నాగరాజు, బుర్ర శంకర్ తదితరులు ఉన్నారు.

# పిఆర్‌టియు మండల అధ్యక్షుడుగా గురజాల ధనయ్య ఎన్నిక

**చండూరు,28జనవరి,ప్రభాతవార్త:**





పిఆర్‌టియు మండల కమిటి అధ్యక్షుడిగా గురజాల ధనయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె. ఇమ్రాన్‌లను పిఆర్‌టియు తెలంగాణ కమిటి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకునానరు. అదేవిదంగా ఉపాధ్యక్షుడిగా జి.గోపయ్య, సహాయ కార్యదర్శిగా కర్నాటి రమేష్, కోశాధికారిగా వనం భిక్షపతి,అసోసియుట్ కార్యదర్శిగా రామగిరి శ్రీనులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటి సూచనల మేరకు సంఘం బలోపేతానికి , ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కందిమళ్ల కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు చిలుముల బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొడదల శంకర్ , ఆదిమల్ల మనిరాజు, తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ నేషనల్స్ కబడ్డీ టోర్నమెంట్‌కు క్రీడాకారుడు రాకేష్

**డిండి,జనవరి 28,ప్రభాతవార్త**

గజ్వేల్‌లో జరిగిన జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్షిప్‌లో మెదక్ జిల్లా తరపున ఆడి మంచి ప్రదర్శనతో ఫిబ్రవరి 1 నుండి హైదరాబాద్ గేహ్లోట్ స్టేడియంలో జరుగు జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు రాకేష్ ఎంపిక అయ్యాడని చెరుకుపల్లి స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకులు,వ్యాయమ ఉపాధ్యాయుడు నిమ్మల లెనిన్ బాబు తెలిపారు. రాకేష్ ఎంపికపట్ల డిండి మండల ప్రజాప్రతినిధులు,స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు మల్లికార్జున్, వెంకటేష్, వహీద్, చంద్, శేఖర్, శ్రీను, రమేష్ వ్యాయమ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసి క్రీడాకారుడు రాకేష్‌కి శుభాకాంక్షలు తెలిపారు.



## క్రీడా విజేతలకు బహుమతి ప్రధానోత్సవం

*చౌటుప్పల్, జనవరి 28 (ప్రభాతవార్త)*



స్నేహపూరితమైన వాతావరణంలో క్రీడా పోటీలను నిర్వహించుకోవాలని ప్రముఖ విద్యావేత్త మీసాల నరేష్ పిలుపునిచ్చారు. చౌటుప్పల్‌లో బాక్స్ క్రికెట్ టోర్నమెంట్స్ సీజన్-3లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన తన సొంత నిధుల ద్వారా సమకూర్చిన నగదు, మెమెంటోలను శనివారం రాత్రి విజేతలకు అందజేశారు. మొదటి బహుమతిగా అన్నెమోని శివాజీ టీం గెలుపొందగా, రన్నర్‌గా శ్రీతన్ సిమెంట్ టీం గెలుపొందింది. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమిని రేపటి గెలుపు కోసం ఆదర్శంగా తీసుకుని క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. టోర్నమెంట్స్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అవిశెట్టి లింగస్వామి, సింగిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వెంకటేష్, నిర్వాహకులు, క్రీడాకారులు మలిగె కార్తీక్, బత్తుల తిరుమలేష్, బత్తుల రాజు, నల్ల శివప్రసాద్, బాతరాజు దిలీప్, ఉప్పోగుల సురేష్, అర్జున్, సుర్కంటి శివశంకర్‌రెడ్డి, మట్టపల్లి సాయికాంత్ తదితరులున్నారు.

## వెంకంబావితండాలో సామాజిక తనిఖీలు

*సంస్థాన్‌నారాయణపురం, జనవరి 28 (ప్రభాతవార్త)*



సంస్థాన్‌నారాయణపురం మండలం వెంకంబావితండా గ్రామ పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 14వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభను సర్పంచు పానుగోతు పాండురంగా నాయక్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌పి నర్సింహులు సామాజిక తనిఖీలు 27 రకాల పనుల గురించి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఈసి లహరి, టిఎ.నవత, పంచాయతీ కార్యదర్శి చాంద్‌పాషా, ఎఫ్ఎ రవి, యస్సార్, పి.ప్రభు, మానస, సంగీత, వార్డు సభ్యులు రఘు, లాల్‌సింగ్, మోత్యా, సక్రు, భగ్యు, బిక్కు, రఘు, బాలాజీ, చందు, చంటి, కోటి, రక్కి, సోనా, బుజ్జి, స్వరూప, సాలి, లాలి, మౌనిక, విజయ, బీమిని, సాయిరాం, శివ, విష్ణు తదితరులున్నారు.

## స్నేహితునికి కుటుంబానికి అండగా నిలిచిన మిత్రులు

*నార్కట్‌పల్లి, జనవరి 28 (ప్రభాతవార్త)*



తమ తోటి స్నేహితుడు మృతిచెందిన విషయం తెలుసుకున్న మిత్రులు అతని కుటుంబానికి ఆసరాగా నిలిచారు.మండలంలోని తొండల్‌వాయి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెమ్మానిలో 2000-2001 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థుల్లో మేడిపల్లి వెంకన్న అకాల మరణం చెందగా తోటి మిత్రులు రూ.68,611లను అతని కుటుంబ సభ్యులకు అందజేసి తమ మిత్రుని పట్ల వారికున్న అభిమానాన్ని చాటుకున్నారు.కార్యక్రమంలో విద్యాసాగర్, గిరి, నరేష్, బాబు, వెంకటరెడ్డి, కర్నాకర్, సైదులు, నరసింహ, ఆంజనేయులు మరియు ఇతర తోటి విద్యార్థులు, వెంకన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్‌సి.ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బిఎస్‌పిలో చేరికలు..

*బీబీనగర్, జనవరి 28 (ప్రభాతవార్త)*



యాదాద్రి భువనగిరి జిల్లా బిఎస్‌పి కమిటీ ఆధ్వర్యంలో బిఎస్‌పి రాష్ట్ర కమిటీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ సమక్షంలో జిల్లాకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు బిఎస్‌పిలో చేరారు. ఈ సందర్భంగా ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఎస్‌పి బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ ఇంచార్జీ కొండమడుగు రాజు, జిల్లా ధ్యక్షులు కనకుంట్ల పాండు, మహిళా కన్వీనర్ కొమ్ము సరిత, గడ్డం వీరస్వామి, కొమ్మూ ప్రకాష్, గుండు కృష్ణ, రాంపల్లి నర్సింగ్‌రావు తదితరులున్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

*నార్కట్‌పల్లి, జనవరి 28 (ప్రభాతవార్త)*



మండలంలోని కొండపాకగూడెం గ్రామానికి చెందిన దుంపలపల్లి జయమ్మ ఇటీవలి అకాల మరణం చెందినది.మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము విజయ్ ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి తన సోదరుడు కొమ్ము మల్లేష్ సహకారంతో 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆరె భాస్కర్, ఆత్మ కమిటి డైరెక్టర్ బొద్దుల తిరుపతి, రైతు విభాగం మండల అధ్యక్షుడు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## యువత ఏకమై గ్రామాభివృద్ధికి తోడ్పడాలి - హరికృష్ణ

*నార్కట్‌పల్లి, జనవరి 28 (ప్రభాతవార్త)*



గ్రామాల్లో ఉన్న యువత అందరూ ఏకమై స్వచ్ఛంద సంఘంగా ఏర్పడి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ అన్నారు.ఆదివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మానసిక వికలాంగుల ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాలలో యువత చురుగ్గా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, సంస్థ సభ్యులు గడగోజు ఎల్లాచారి, బోయిన మహేశ్, చేదు, రాజశేఖర్, గిరిబాబు, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలు అంతమ్మ మృతి

*సంస్థాన్‌నారాయణపురం, జనవరి 28 (ప్రభాతవార్త)*



సంస్థాన్‌నారాయణపురం మండలం వావిళ్లపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు ఆత్కూరి అంతమ్మ(101) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. మృతురాలికి ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు కలరు. ఆత్కూరి నర్సింహా, చంద్రయ్య, సత్తయ్య, పుల్లయ్య, వెంటయ్య, కుమార్తెలు యాదమ్మ, చిలకమ్మ, భారతమ్మలు కలరు. అంతమ్మ మృతి పట్ల గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.

## పదేళ్ల తరువాత కలిసిన మిత్రులు

*కోదాడ రూరల్, జనవరి 28 (ప్రభాతవార్త)*



ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులేనని పలువురు భారతీ విద్యా మందిర్ పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. పట్టణంలోని భారతీ విద్యా మందిర్ పాఠశాలలో 2003-04 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి పలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో స్థిరపడ్డారు. వారంతా ఆదివారం కోదాడ పట్టణంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి మరపురాని మధురమైన సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. పదేళ్ల తరువాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ నరేష్, ఉపేందర్, గోపికృష్ణ, శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

*చిట్యాల రూరల్, జనవరి 28, (ప్రభాతవార్త):*



చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలోని నాలుగో వార్డుకు చెందిన పంగ మల్లారెడ్డి అమ్మమ్మ వెల్గి ఈదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం మృతురాలి నివాసంలో కుటుంబ సభ్యులు నిర్వహించిన దశదిన కర్మకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంతటి పారిజాత నర్సింహ్మగౌడ్, ఆపార్టీ నాయకులతో కలిసి హాజరై ఈదమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశానుసారం రూ. 5వేలు నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఆమె వెంట పార్టీ గ్రామశాఖ కార్యదర్శి చిరగోని శ్రీశైలం, పిఏసిఎస్ వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, పాలసంగం చైర్మన్ మారగోని యాదయ్య, నాయకులు గడ్డం సత్తిరెడ్డి, దేశబోయిన బిక్షమయ్య, ఉంగరాల పటేల్, బుచ్చిరెడ్డి, కాటం సత్తయ్య, గుర్రం జంగయ్య, కర్నాటి అంజిరెడ్డి, బొంతల నరేందర్, చిరగోని శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

*నాగార్జునసాగర్, జనవరి 28, (ప్రభాతవార్త):*

నాగార్జునసాగర్ హిల్ కాలనీలో విద్యా భారతి కో ఆపరేటీవ్ జూనియర్ కళాశాలలో 2004 06 సంవత్సరంలో ఇంటర్ విద్యను అభ్యసించిన విద్యార్థులు 10 సంవత్సరాల సందర్భంగా కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులను శాలువాలతో సన్మానించి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో నాటి అధ్యాపకులు శ్రీనివాస్, నకుల్‌రావు, అర్జున్‌రావు, రామకృష్ణ, భాష, రమ్య, జానీ, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ కులగణన నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నాం

ప్రభాతవార్త ప్రతినిధి- హన్మకొండ: తెలంగాణ రాష్ట్రంలో కూడా కులగణన చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంఘాల నాయకులు సోమిడి అంజన్‌రావు, డాక్టర్ శేషు తెలియజేశారు. హరిత కాకతీయ హోటల్‌లో డాక్టర్ తిరునహరి శేషు అధ్యక్షతన జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సోమిడి అంజన్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయిన తర్వాత అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి నా వివిధ కులాల లెక్కలను మాత్రం బయట పెట్టలేదు. కానీ కొత్తగా ఏర్పాటు అయినా కాంగ్రెస్ ప్రభుత్వము మాత్రం రాష్ట్రంలో కుల గణన చేయాలని నిర్ణయించటాన్ని బీసీ సంఘాలుగా ఆహ్వానిస్తున్నామని అభిప్రాయ పడినారు. బీసీలు దశాబ్దాలుగా కుల గణన చేయాలని డిమాండ్ చేసినప్పటికి కూడా ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన చేయాలని నిర్ణయించటాన్ని స్వాగతిస్తు న్నాయి. రిజర్వేషన్లను హేతుబద్ధంగా అమలు చేయడానికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో వివక్షత లేకుండా అమలు చేయటానికి ప్రభుత్వ విధాన నిర్ణయాల రూపకల్పనకి కులగణన సహాయపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలియజేశారు.



డాక్టర్ తిరునహరి శేషు మాట్లాడుతూ కులగణన విషయంలో కాంగ్రెస్ పార్టీ ఒక స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించిన నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ కూడా కుల గణన పట్ల తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలు కులగణన చేస్తున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వానికి కుల గణన చేయటంలో ఉన్న అభ్యంతరాలు ఏమిటో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా కుల గణన చేయడం ద్వారా వెనుకబడిన తరగతులను న్యాయం చేయగలుగుతుందని అభిప్రాయ పడినారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధిరాజు యాదవ్, జిల్లా అధ్యక్షులు పిట్టల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలి

## -ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ డిమాండ్

ఎడ్యుకేషన్ కేయూ, జనవరి 28 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆకాంక్షించారు. కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలోని సెమినార్ హాల్‌లో ఆదివారం జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ అధిపతి రాష్ట్ర పూలే ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ పునః నిర్మాణం దశ దిశ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఇప్పు ప్రొఫెసర్ రాజారాం, కేయూ ప్రొఫెసర్ తాడూరి శాస్త్రీ హాజరయ్యారు. ఈసదస్సుకు అధ్యక్షత వహించిన పాస్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ ప్రగతి భవన్‌ను మహాత్మా జ్యోతిరావు పూలే భవన్‌గా నామకరణం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంను పూర్తిస్థాయిలో పునర్జీవనం చేయాలని అన్నారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో రిపేర్ చేయవలసిందిపోయి కూల్చివేసిందని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ పునః నిర్మాణం చేయాలని అన్నారు. గతంలో మంత్రి మండలి భజన మండలిగా మారిపోయిందని విమర్శించారు. ఇప్పు ప్రొఫెసర్ కె.రాజారాం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసినందుకే ఇప్పుడు తెలంగాణ పునఃనిర్మాణం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, జర్నలిజం ఫ్యాకల్టీ కంజర్ల నరసింహరాములు, శ్రీకాంత్‌యాదవ్, డాక్టర్ సుధాకర్, వెంకటేశ్వర్లు, పద్మ, మోటె చిరంజీవి, ఈర్ల సురేందర్, డాక్టర్ జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికలకు గ్రాడ్యుయేట్స్ ఓట్లు నమోదు చేసుకోవాలి

దుగ్గొండి, జనవరి 28, ప్రభాతవార్త: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యావంతుడు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నర్సంపేట బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు శానబోయిన రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని గిర్నిబావి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి 2020-2021 సంవత్సరానికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యావంతుడు గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా ఫిబ్రవరి 6 వరకు కొత్త ఓటును నమోదు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న గ్రాడ్యుయేట్స్‌లను గుర్తించి నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ప్రతి గ్రాడ్యుయేట్ మెమో ఆధార్, ఐడి, పాస్ పోర్టుతో ఓటును నమోదు చేసుకో వాల న్నారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేస్తున్నా మన్నారు. ఈ కార్య క్రమ ంలో దుగ్గొండి మండల గ్రాడ్యుయేట్ ఎన్నికల ఇంచార్జి యాదగిరి సుధాకర్, కక్కెర్ల ప్రమోద్, పొగాకు బాలకృష్ణ, మేకల రాజ్‌కుమార్, బొడిగె బాలకృష్ణ, అమంచ లక్ష్మణ్, జోగ్యా నాయక్, పోశెట్టి రంజిత్ కుమార్, తక్కళ్లపల్లి వినోద్‌లు పాల్గొన్నారు.



# గొంతమ్మ గుట్టపై ఘనంగా లక్ష్మీదేవర జాతర

## -ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్పీ కిరణ్ ఖరే దంపతులు

కాటారం, జనవరి 28, ప్రభాతవార్త: తరతరాల నుండి అనాదిగా వస్తున్న గొంతమ్మ గుట్ట లక్ష్మీదేవర బోనాల జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ప్రతాపగిరి గొంతమ్మ గుట్టపై లక్ష్మీదేవర బోనాలు, పట్నాలతో ఘనంగా నిర్వహించారు. చుట్టూ నలుమూలాలా నుండి భక్తులు, నాలుగు రాష్ట్రాల నుండి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన లక్ష్మీదేవరతో గుట్టపైకి చేరుకొని లక్ష్మీదేవరను తులతూగించారు. శివసత్తుల పూనకాలతో గుట్టపై జనసందోహంతో నిండిపోయి కళకళాడింది. నాయకపోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి సౌకర్యం కలుగకుండా చలువ పందిర్లు, సోలార్ విద్యుత్, వాటర్ మరియు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కాటారం ఎంపిపి పంతకాని సమ్మయ్య, ఎంపిటీసీ మహేష్ రవీందర్ రావు దగ్గర ఉండి పనులను పర్యవేక్షించారు. వచ్చే జాతర వరకైన గుట్టవరకు, త్రాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం భక్తులకు ఉండడానికి షెడ్డు నిర్మించాలని, అదేవిధంగా గొంతమ్మగుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే దంపతులు గొంతమ్మ గుట్టను దర్శించుకొని పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో వారితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కాటారం డిఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి, కాటారం, మహముత్తారం ఎస్సైలు మ్యాక అభినవ్, సుధాకర్ దాసరితో పాటు సివిల్ పోలీసులు, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది, భక్తజనం తదతదిరులు ఉన్నారు.





# ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఉద్యమాన్ని బలోపేతం చేయాలి



– గన్నెపాక లక్ష్మణ్

**నిడమనూరు, జనవరి 28, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షులు గన్నెపాక లక్ష్మణ్ మాదిగ అన్నారు. ఆదివారం నిడమనూరు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ సమావేశం నిర్వహించి మండల నూతన అధ్యక్షుడిగా ఇంజమూరి కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా తరి వెంకన్నను నియమించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణకై ప్రతి గ్రామంలో కమిటీలు వేస్తూ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని మోసం చేసిన బీజేపీ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయడం కోసం రాష్ట్రంలో ఉన్న ఎస్సీ ఉపకులాలు అన్ని సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# రక్తదాతలకు ఘన సన్మానం,సేవారత్న పురస్కార ప్రదానం

## రక్తదానం జీవన దానం – శశికుమార్

నార్కట్‌పల్లి, జనవరి 28 ప్రభాతవార్త



రక్తదానం జీవన దానం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి తమ జీవితకాలంలో వీలైనన్ని సార్లు రక్తదానం చేయాలని , ముఖ్యంగా యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆపద బాంధవ్ ఫౌండేషన్ అధ్యక్షుడు పంజాల శశికుమార్ అన్నారు. మిర్యాలగూడకు చెందిన జనయేత్రి ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ సంగీత దర్శకులు ఆర్.పి.పట్నాయక్ చేతుల మీదుగా ఆపద్బాంధవ్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను గుర్తించి వారికి ఆదివారం "సేవారత్న" పురస్కారాన్ని అందించారు. పురస్కారంలో భాగంగా ఫౌండేషన్ అధ్యక్షుడు పంజాల శశికుమార్, ఉపాధ్యక్షుడు పొట్టపంగ గణేష్, సభ్యులు దూదిమెట్ల సాయి కుమార్, కంచర్ల రాజు, శ్రీకాంత్, అనిల్ కుమార్‌లకు ప్రశంసా పత్రిన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. గత 4 సంవత్సరాలుగా ప్రతి రోజు ఆపదలో ఉన్న వారికి రక్తమందిస్తూ దాదాపు కొన్ని వేల మందికి తన మిత్రులతో కలిసి రక్త దానం చేయిస్తున్న వారి స్ఫూర్తిని గుర్తించి ఈ అవార్డును వారికి అందిస్తున్నామని జనయేత్రి ఫౌండేషన్ వారు పేర్కొన్నారు. వీరి సేవలను ఆర్‌పి పట్నాయక్ ప్రశంసించారు. ఈ సందర్భంగా తమకు వచ్చిన ఈ అవార్డు తమ బాధ్యతను మరింతగా పెంచిందని శశికుమార్ అన్నారు. కార్యక్రమంలో వరల్డ్ రికార్డ్ రక్తదాత 294 డా॥సంపత్ కుమార్, సమాజ సేవకురాలు కర్నె శిరీష (బ్రిటెన్స్), పారాష్యూట్ హెయిర్ ఆయిల్ బ్రాండ్ అంబాసిడర్ కుమారి దుర్గా లావణ్య, డా॥సకీజ ఖాన్, జనయేత్రి వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ముస్సి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తాటిచెట్టుపై నుండి పడి గీత కార్మికునికి గాయాలు

**గణపురం, జనవరి 28, ప్రభాతవార్త:** మండలకేంద్రానికి చెందిన కొండపాక చంద్రమౌళి తాటిచెట్టుపై నుండి పడి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం..చంద్రమౌళి గీత కార్మిక వృత్తిలో భాగంగా ఆదివారం ఉదయం తాటిచెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా కాలు జారడంతో తాటిచెట్టు పైనుండి కింద పడిపోవడంతో ఎడమ కాలుకు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న తోటి గీత కార్మికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. గాయాలైన టువంటి చంద్రమౌళి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మికులు విజ్ఞప్తి చేశారు.

# ఫిబ్రవరి 16వ దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

## సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

జూలపల్లి,ప్రభాతవార్త :



జూలపల్లి మండల కేంద్రంలో ఆదివారం రోజున గ్రామ పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం ప్రభుత్వ స్కూలు ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు,ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక,రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రతిఘటనగా ఫిబ్రవరి 16న కార్మికుల సమ్మె,గ్రామీణ బంధు నిర్వహించాలని దేశంలోని కార్మిక,రైతు,వ్యవసాయ కూలీ సంఘాలు నిర్ణయించాయని అన్నారు. కనీస వేతనం నెలకు 26000/- రూపాయలు చెల్లించాలని,కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని,ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు చేయకూడదని,రైతులు పండించిన గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పచెప్పే తప్పుడు విధానాలను మానుకోవాలని,వ్యవసాయ కూలీలకు వందరోజుల పనిని 200 రోజులకు పెంచాలని,రోజు కూలీ 600/- రూపాయలుగా నిర్ణయించాలని,పెరుగుతున్న గ్యాస్,పెట్రోల్,నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించాలని,కేంద్ర ప్రభుత్వశాఖల పరిధిలో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని,తదితర 23 డిమాండ్లతో ఈ సమ్మె నిర్వహించడం జరుగుతుందని,ఈ దేశభక్తి యుతమైన సమ్మెలో జిల్లాలోని కార్మికులు,రైతులు,వ్యవసాయ కూలీలు,ప్రజానీకం అందరు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మండలంలో వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు రెండు,మూడు నెలలుగా వేతనాలు పెండింగ్లో ఉన్నాయని,గత సంవత్సరంలో జరిగిన సమ్మెకాల వేతనం కూడా ఇప్పటివరకు చెల్లించలేదని అన్నారు. పెండింగ్ వేతనాలు,సమ్మెకాల వేతనం కార్మికులకు చెల్లించేవిధంగా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల నాయకులు బి.సంపత్,ఆనపల్లి బానయ్య, ఆర్.నాగేష్,కే.సురేందర్,ఎం.రాజయ్య,సంధి స్వామి,లచ్చయ్య,వెంకటేష్,సూర్య నందన్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మండలారధన పూజ మహోత్సవం

కొడిమ్యాల,ప్రభాతవార్త :



కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాణ ప్రతిష్టాపన జరిగి ఈరోజు వరకు 41 రోజులు గడిచి (మండలం) పూర్తి చేసుకొని ఈరోజున మూల విరాట్కు,ఉత్సవ మూర్తులకు ,పంచామృత అభిషేకం,ఘనంగా సుదర్శన హోమం తదుపరి మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఇట్టి పూజ కార్యక్రమాలు ఉపేజగన్నాథం విష్ణు వర్ధనాచార్యులు,వారి శిష్య బృందం, ఆలయ అర్చకులు నాగం రాజు,రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో వేద పండితులు అర్చకులు,దాతలు,నిర్మాణ కమిటీ సభ్యులు,భక్తులు,గ్రామస్తులు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

## ఆదర్శవంతమైన గ్రామం సుల్తాన్‌పూర్ రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి - జీపి భవనం నుంచి నుంచి శివపల్లి వరకు బిటి రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి

ఎలిగేడు,ప్రభాతవార్త : సుల్తాన్‌పూర్ గ్రామం మంచి అభివృద్ధి సాధించి మిగిలిన గ్రామాలకు ఆదర్శవంతంగా నిలిచిందని,పట్టుదలతో వివిధ రంగాలలో మంచి పురోగతి సాధించడం అభినందనీయమని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.ఆదివారం రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో పర్యటించి 36 లక్షల రూపాయలతో నిర్మించి గ్రామపంచాయతీ భవనాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు,ఎమ్మెల్సీ టి.భానుప్రసాద్‌రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అనేక అవార్డులు సాధించి ఆదర్శవంతంగా నిలిచిన సుల్తాన్‌పూర్ గ్రామ పంచాయతీ పాలక మండలికి,గ్రామ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వ్యవసాయ రంగంలో మంచి అభివృద్ధి సాధించారని,పాఠశాలల్లో సైతం కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందిస్తున్నారని,రీడింగ్ రూమ్ ఏర్పాటు చేసి అందరూ చదివేలా చర్యలు తీసుకోవడం వంటి మంచి కార్యక్రమాలను అమలు చేస్తూ సుల్తాన్‌పూర్ ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే పట్టుదల ఉన్న వ్యక్తి అని,పెద్దపల్లి అభివృద్ధి కోసం ఎంత రాత్రి వరకైనా వేచి ఉండి అధికారులతో మాట్లాడి పనులు సాధించుకెలుగుతారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ భవనం నుంచి శివపల్లి వరకు నాలుగు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు పంచాయతీరాజ్ శాఖ మంత్రితో మాట్లాడి మంజూరు చేసేలా కృషి చేస్తానని తెలిపారు.భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని తరువాత ప్రజా సంక్షేమం,అభివృద్ధిపై దృష్టి సారించి పాలన అందిస్తున్నామని,గత ప్రభుత్వం రూపొందించిన మంచి పాలసీలను తప్పనిసరిగా కొనసాగిస్తామని మంత్రి పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజులలోనే రెండు గ్యారెంటీ పథకాలను అమలు చేశామని,మహాలక్ష్మీ పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటివరకు మహిళలకు 10 కోట్ల జీరో టికెట్స్ జారీ చేశామని,ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళా సాధికారత సాధ్యమవుతుందని అన్నారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని,మిగిలిన గ్యారెంటీ పథకాలను సైతం తప్పనిసరిగా అమలు చేస్తామని,పథకాల అమలు విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు ఉండాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. పాలనలో భాగంగా ప్రజలు మేలు కొరకు ఇతరులు చేసే సూచనలు తప్పనిసరిగా పాటిస్తామని,ఇటీవల నిర్వహించిన విదేశీ పర్యటనలో సైతం పారిశ్రామికవేత్తలు గత ప్రభుత్వం పాటించిన పాలసీలు కొనసాగిస్తారా లేదా అని అనుమానం తెలియజేసిన సమయంలో,తప్పనిసరిగా రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా మంచి పాలసీలను కొనసాగిస్తామని స్పష్టం చేశామని మంత్రి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి రాష్ట్ర అభివృద్ధి మాత్రమే ముఖ్యమని,ఎలాంటి భేషజాలు లేకుండా ప్రజా సంక్షేమ పాలనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. జిల్లాలో రైతులు లాభదాయక పంటల సాగు దిశగా దృష్టి సారించాలని,ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని మంత్రి వ్యవసాయ శాఖ అధికారి సూచించారు. ఐటీ పరిశ్రమలను ఆహ్వానించి,వాటి ఏర్పాటు జరిగే దిశగా అవసరమైన కృషి చేస్తామని,పరిశ్రమలు ఏర్పాటు దిశగా సైతం ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని మంత్రి తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో వ్యవసాయధారిత పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని,ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీలను వినియోగించుకుని రైతులు సైతం చిన్న,చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసే పరిశ్రమలలో మన యువకులకు ఉపాధి అవకాశాలు లభించేందుకు వారికి అవసరమైన నైపుణ్యాలను దిశగా,జిల్లా కేంద్రాలలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు.జనవరి నెలలో సర్పంచుల పదవీకాలం ముగుస్తుందని,కరోనా కారణంగా అనేక సవాలు ఎదురవుతూ నిధుల సమస్య వచ్చినప్పటికీ సర్పంచులు పంచాయతీ పాలనలో గత 5 సంవత్సరాల పాటు మంచి కృషి చేశారని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో సైతం ఐటీ పరిశ్రమల అభివృద్ధి జరిగే విధంగా మంత్రి చొరవ తీసుకుని,స్థానిక యువతకు ఉపాధి లభించేలా పెద్దపల్లికి పరిశ్రమలు తీసుకుని రావాలని కోరారు. పెద్దపల్లి జిల్లాలో త్రాగునీరు విద్యుత్ సమస్యలు లేవని ఇక్కడి ప్రజలు సైతం విద్యావంతులని,పరిశ్రమల ఏర్పాటుకు అన్ని వర్గాల ప్రజల నుంచి సంపూర్ణ సహకారం అందుతుందని అన్నారు. గతంలో ప్రారంభించిన మంచి పాలసీలను ముందుకు తీసుకొని వెళ్లాలని గ్రామ అభివృద్ధికి మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ,జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆదిరెడ్డి,ఎలిగేడు ఎంపీపీ తానుపర్తి స్రవంతి మోహన్‌రావు,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మండిగా రేణుక నరసయ్య, ఉపసర్పంచ్ పల్లె హరీష్‌గౌడ్,వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లో భారీ చేరికలు..

వీణవంక, ప్రభాత వార్త:



హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో వీణవంక మండలం మల్లారెడ్డి బిజెపి పార్టీ సర్పంచ్ ఎం. ఎల్లారెడ్డి, ఎం. భిక్షపతి ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్ ముద్దసాని సమ్మయ్య,లక్ష్మక్కపల్లి గ్రామ సర్పంచ్ దాసరపు సుజాత లక్ష్మణ్, మేకల కోమల్ రెడ్డి, గుమ్ము రవి, కర్రి రాజయ్యతో పాటు 300 మంది బిజెపి, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వీణవంక మండల అధ్యక్షులు శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.

# పూర్వ ఉపాధ్యాయునికి అండగా ఆర్థిక సహాయం..

వీణవంక, ప్రభాత వార్త:



వీణవంక మండల కేంద్రానికి చెందిన పత్తి కొండల్ రెడ్డి వీణవంకలోని శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు, పత్రిక పాత్రికేయునిగా పనిచేస్తూ ఉన్నత పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు ప్రస్తుతం జర్నలిస్ట్‌గా కొనసాగుతున్న తరుణంలో పక్షవాతంతో అనారోగ్యానికి గురైన సమాచారం అందుకున్న ఆ పాఠశాల 2006 - 2007 వ బ్యాచ్ కి చెందిన విద్యార్థులు 30వేలు జమచేసి కొండాల్ రెడ్డికి ఆ బ్యాచ్ తరఫున పూర్వ విద్యార్థులు నీల శ్రీనివాస్, పోతరవేణ రాజ్ కుమార్, కూన శ్రీనివాస్, మ్యాకల అశోక్, పంజాల శ్రీనివాస్ లు చికిత్స నిమిత్తం అందజేసి అండగా నిలిచారు.

## డిండిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా

దేవరకొండ ఎమ్మెల్యే నేనావాత్ బాలునాయక్



**డిండి, జనవరి 28,ప్రభాతవార్త :** డిండి మండలాన్ని అన్నిరంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేస్తానని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ వెల్లడించారు. ఆదివారం డిండి మండలపరిధిలోని శాంతిగూడెం, వావిల్‌కోల్, గదరాల తండా, చెరుకుపల్లి, ప్రతాప్‌నగర్, ఖానాపూర్, టీ గౌరారం ఆయా గ్రామ పంచాయతీలలో ఎస్‌డిఎఫ్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఏర్పాటు చేసిన రోడ్ల శంకుస్థాపనలతోపాటు నూతన గ్రామపంచాయతీ భవనాల శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తానని చెప్పారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఘనవిజయం సాధిస్తుందని, దేశంలో వచ్చేది రాహుల్‌గాంధీ ప్రభుత్వమేనని బాలునాయక్ ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వం రావు, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీను, ఎంపిపి మాధవరం సునీత జనార్దన్‌రావు, సీనియర్ నాయకులు యాదగిరిరావు, బుచ్చిరెడ్డి, ముత్యపురావు, భాస్కర్ రెడ్డి, రాంకిరణ్, రేక్యనాయక్, ఎంపిటిసిలు శేఖర్‌రెడ్డి, దొంతినేని శ్రీలత, సర్పంచులు విజేందర్‌రెడ్డి, ఏమిరెడ్డి సుధామణి వెంకట్‌రెడ్డి, లక్ష్మీ తిరుపతి, మైనొద్దీన్, గిరీష్ యాదవ్ ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## గడ్డిపల్లి మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ సస్పెండ్

**గరిడేపల్లి జనవరి 28 ప్రభాతవార్త**

విధులలో నిర్లక్ష్యం వహించినందుకుగాను గడ్డిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఐతరాజు సుధాకర్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈవో అశోక్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 20వ తేది వార్త పత్రికలో ప్రభుత్వ సంస్థలు- అమ్మాయిల ట్రాప్ అనే శీర్షికన వచ్చిన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపిన అనంతరం కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఆయన స్థానంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా మునగాల మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సాయిఈశ్వరికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ప్రిన్సిపాల్‌పై పలు ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన జిల్లావిద్యాశాఖ అధికారులు ఆయన పై చర్యలు తీసుకున్నారు.

## గ్రాట్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పనుల అశోక్ యాదవ్



**నూతనకల్, 28జనవరి, ప్రభాతవార్త:** నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పనుల అశోక్ యాదవ్ పట్టభద్రులను కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఓటరుగా నమోదు కోసం ఫాం 18లో ధరఖాస్తు చేసుకోవాలని, నవంబర్ 1,2023 నాటికి మూడు సంవత్సరాల ముందు డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. సాధారణ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన మండలంలో మాత్రమే నమోదు చేసుకోవాలని,గతంలో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటరుగా నమోదు అయ్యి ఓటు హక్కు వినియోగించుకున్నప్పటికీ మరల కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. వచ్చే నెల 6వ తేదీ చివరి రోజని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సహా మీ ఓటు హక్కు ఉన్న మండల తహసీల్దార్ కార్యాలయంలో ధరఖాస్తు ఫారాలను సమర్పించాలని , లేదా ఆన్‌లైన్‌లో కూడా ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.దీనికి గాను ఆధార్‌కార్డు,ఓటరు ఐడి, పాస్‌ఫోటో, డిగ్రీ మెమోలను తీసుకుని అందుబాటులో ఉన్న మీసేవా కేంద్రాలవద్ద నమోదు చేసుకోవచ్చని సూచించారు.

## ఎస్సారెస్పి 36 ఎల్ కెనాల్ పరిశీలన

**మోతె,28జనవరి,ప్రభాతవార్త:** కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి అదేశాలమేరకు ఆదివారం ఎస్సారెస్పీ 36 కెనాల్‌ను డిఈ రమేష్ , ఏఈ లింగయ్యలు పరిశీలించారు. నీటివాటా సమస్యలు త్వరలోనే పూర్తి స్థాయిలో మోతె మండలానికి ఎస్సారెస్పీ నీళ్లు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి,యటా సైదులు, పుల్లయ్య,తదితరులు పాల్గొన్నారు

# మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి

**భారీ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**మఠంపల్లి జనవరి 28 ప్రభాతవార్త :** మఠంపల్లి మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని, నియోజవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానని భారీ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కృష్ణతండాలో రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయితీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గతంలో మంత్రిగా ఉన్నప్పుడు, ఎమ్మెల్యేగా ఉన్నపుడు హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని,తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలను కలుపుతూ హైలెవల్ బ్రిడ్జ నిర్మాణం చేశానని, అదేవిధంగా అన్నిగ్రామాలకు రోడ్డు సౌకర్యం, సబ్‌స్టేషన్ల నిర్మాణం చేశానని, కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశానన్నారు. గిరిజనతండాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, నూతనంగా ఏర్పడిన తండాలలో అంగన్‌వాడీ బిల్డింగ్‌లు, గ్రామపంచాయితీ బిల్డింగుల ఏర్పాటుకు కృషి చేస్తానని, గిరిజన బిడ్డల ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం రిజర్వేషన్ అమలయ్యేందుకు కృషి చేస్తానన్నారు. రూ.కోటి తో ఎన్ఆర్ఈజిఎస్ నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, గ్రామాలలో రోడ్ల నిర్మాణానికి ఈ నిధులు దోహదపడతాయని ఆయన అన్నారు. మారుమూల కృష్ణతండలో గ్రామపంచాయితీ బిల్డింగ్ నిర్మాణం చేసి ప్రారంభోత్సవానికి రావడం ఎంతో సంతోషంగా ఉందని, మీరు చూపిస్తున్న ఆదరాభిమానాలు ఎల్లపుడు ఉండాలని అన్నారు. ముందు గ్రామప్రజలు మంత్రికి స్వాగతం పలికేందు కు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఘనస్వాగతం పలికారు. కోలాట భజనలతో స్వాగతం పలికి గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కళ్యాణలక్ష్మి, షాదీముబా రక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, పార్టీ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, మహిళలు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్

**...మరోసారి గడువు పెంపు**



**చండూరు,28జనవరి,ప్రభాతవార్త:** రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.ఈకెవైసి చేసుకునేందుకు గడువు జనవరి 31తో ముగుస్తుండటంతో సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది.ప్రజలనుండి వచ్చిన అభ్యర్థనల మేరకు గడువు పొడిగిస్తున్నట్లుగా రాష్ట్ర సివిల్ సప్లై శాఖ ప్రకటించింది.ఫిబ్రవరి చివరివరకు ఈకెవైసి కి అవకాశం ఇస్తున్నట్లు వెల్లడించింది. ఈ నెల 31 గడువు ముగియనుండటంతో రేషన్ షాపుల వద్ద లబ్దిదారులు క్యూ కడుతున్నారు. దీంతో స్పందించిన ప్రభుత్వం మరోసారి గడువు తేదీని పొడిగించింది.కాగా రాష్ట్రంలో ఇప్పటివరకు 75 శాతంమంది రేషన్ కార్డుదారులు ఈకెవైసి పూఇరతన చేసుకున్నట్లు తెలుస్తోంది, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా కేంద్రం అన్ని రాష్ట్రాలలో ఉచిత రేషన్ అందిస్తోంది.కానీ బోగస్ రేషన్ కార్డులను ఏరివేయడానికి ఆధార్‌నంబర్‌తో రేషన్ కార్డులను అనుసంధానం చేయాలని నిర్ణయించింది.దీనికి కారణాలు లేకపోలేదు పాత కార్డులలో చనిపోయినవారి పేర్లు ఉన్నాయి. దీంతో రేషన్ సరుకులు పక్కదారి పడుతున్నాయి. వాటన్నిటికి చెక్ పెట్టేందుకే ఈకెవైసి ప్రక్రియను తెరపైకి తీసుకొచ్చారు.కుటుంబంలో చాలామంది ఉంటే వారందరూ ఈకెవైసీ చేయాలి.మరోవైపు కొత్త రేషన్ కార్డుల ఆమోదానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.త్వరలో విధానపరమైన నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాత లబ్దిదారుల విషయంలో మరింత స్పష్టత రానుంది, ఈ డేటాను కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకున్న తరువాత కొత్త రేషన్ కార్డులు ఎన్ని అవసరమో ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీనినిబట్టి కొత్త కార్డుల మంజూరు ప్రక్రియ వేగవంతం కావడంతోపాటు కార్డుల ప్రక్రియకు మార్గం సుగమం కానుంది.

# ప్రజలకు హాని కలిగించే రసాయనిక పరిశ్రమలను తరిమి కొట్టండి

**.... నెల్లికంటి సత్యం**



**చండూరు/గట్టుప్పల,28జనవరి,ప్రభాతవార్త:** గాలి నీరు , పర్యావరణం కలుషితం చేసే రసాయనిక పరిశ్రమలను గ్రామాలలో అడ్డుకోవాలని , వారి నిర్మాణ పనులు ఆపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం గట్టుప్పల మండల కేంద్రంలో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా వలసలు, కరువు దుర్భిక్ష పరిస్థితులలలో ఉన్న మునుగోడు నియోజకవర్గంలో ప్రజలకు హాని కలిగించే రసాయనిక పరిశ్రమలను గతం ప్రభుత్వ అనుమతి ఇచ్చిందని,వాటిని ఆపాలని గ్రామాల ప్రజలు పోరాటాలు చేశారని,ముఖ్యంగా గట్టుప్పల ,మునుగోడు మండలం కృష్ణాపురం తదితర గ్రామాలలో ఈ పరిశ్రమలు పెడుతున్నారని, వాటివల్ల అనేక రకాల వ్యాధులతో ప్రజలు, పశువులు సతమతం కావడంతో పాటు ఈ ప్రాంతమంతా కాలుష్య ఏర్పడి భవిష్యత్తు వ్యవసాయానికి పనికి రాని భూములగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం పరిశ్రమలను ఆపాలని,నియోజకవర్గానికి సాగు,తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు.ప్రాజెక్టులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ప్రజలకోసం పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లపురాజు రామలింగయ్య, మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, సహాయ కార్యదర్శి రాపోలు సత్తయ్య, ,చేనేత సహకార సంఘం జిల్లా అధ్యక్షులు ధనుంజయ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుధాకర్‌రెడ్డి, పెంటయనయ, మండల కార్యవర్గ సభ్యులు ఐతరాజు లక్ష్మయ్య, లింగస్వామి, పెద్ద యాకయ్య, కట్ట చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

చింతపల్లి ప్రభాతవార్త:



చింతపల్లి మండలం కుర్మపల్లి గ్రామానికి చెందిన యువకులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా పోలోజు రాఘవేంద్ర, దార్ల అరవింద్, వారి కుటుంబాలను పరామర్శించి ఈశ్వరి మాత విశ్వకర్మ హస్త కళా సంఘం మీర్పేట్(కుర్మపల్లి) ఆధ్వర్యంలో బాధిత ఇరు కుటుంబాలకు రూ.25వేల చొప్పున రూ.50వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు దార్ల రాజేష్ చారి, ఉపాధ్యక్షుడు దార్ల శ్రీనివాస్ చారి, జయ బ్రహ్మం చారి, పోలోజు శ్రీనివాసచారి, తోట రామాచారి, బాలబ్రహ్మం, గన్నోజు సంతోష్ చారి, పెరికేటి రాంప్రసాద్, ఎగిరిశెట్టి శ్రీశైలం, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా ఒకరి మృతి

పలువురికి తీవ్రంగా గాయాలు-ఆసుపత్రికి తరలింపు

డిండి, జనవరి 28,ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెంది పలువురు గాయపడిన సంఘటన డిండి మండలంలోని టి.గౌరారం మూలమలుపు వద్ద జరిగింది. ఈ ప్రమాదానికి సంబంధించిన పోలీసులు,స్థానికులు అందించిన వివరాల ప్రకారం మండలంలోని జాల్తండాకు చెందిన కూలీలు మిరపతోటలో మిరపపంటను ఏరడానికి దాదాపు 15 మంది కూలీలు ఆటోలో వెళ్లారు. తిరిగి సాయంత్రం శాంతిగూడెం నుంచి ఇంటికి వెళ్తుండగా డిండి-దేవరకొండ రోడ్డులోని టిగౌరారం తంబల్లబండ వద్దకు చేరుకునేసరికి ప్రమాదవశాత్తు వారు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడింది. దీంతో అందులోవున్న రాత్లావత్ ముత్యాలి(48) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, మిగతా వారు గాయపడగా వారిని దేవరకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## మాజీ మంత్రి రాంరెడ్డిని కలిసిన రూరల్ ఎస్ఐ

ప్రభాతవార్త ప్రతినిధి సూర్యాపేట



సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీమంత్రి వర్యులు, సూర్యాపేట నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన నూతనంగా నియమితులైన సూర్యాపేట రూరల్ ఎస్సై బాలు నాయక్.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఏపూరి పేద బిడ్డకు పలువురి అభినందనలు

ఆత్మకూర్,28జనవరి,ప్రభాతవార్త:



సూర్యాపేట జిల్లా ఏపూరు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన రేసు యాకు స్వామి కష్టపడి ఉన్నత ఉద్యోగం సంపాదించాడు. ముంబైలో కేంద్రప్రభుత్వ సంస్థలో ప్రతిష్టాత్మక ఉద్యోగం సంపాదించిన స్వామిని ఆదివారం హైద్రాబాద్‌లో ఆర్టీఏ మాజీ ఉమ్మడి రాష్ట్ర కమీషనర్ డాక్టర్ వారె వెంకటేశ్వర్లు యాదవ్ , ప్రజాసంఘాల జెఏసి ప్రెసిడెంట్ జైబోరన్న , నేతాజీ సుభాష్ చంద్రబోస్ , అరోరా గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ అరోరా, ప్రజా ఉద్యమకారులు నావిలే వెంకటేశ్వర్లు ,రైతు సంఘం అధ్యక్షులు ఏర్పుల అంజన్న యాదవ్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ వర్రే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని స్వామి నిరూపించాడన్నారు. పేదలు పేదరికం జయించాలంటే విద్య ఒక్కటే పరిష్కారంఅని చెప్పారు.

# యథేచ్ఛగా వ్యర్థ రసాయన జలాలు పారబోత

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్

చిట్యాల రూరల్, జనవరి 28, ప్రభాతవార్త:




పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థ రసాయన జలాలను రాత్రి వేళ ట్యాంకర్లలో నింపి గుట్టు చప్పుడు కాకుండా జాతీయ రహదారి పక్కన ఎక్కడ పడితే అక్కడ వదులుతూ పరిసరాలను కలుషితం చేస్తున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని సిపిఐ జిల్లా కమిటి సభ్యుడు బొడిగె సైదులు, మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం డిమాండ్ చేశారు. చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ శివారులో పరిశ్రమల ద్వారా వెలువడే వ్యర్థ రసాయన జలాలను పారబోసిన స్థలాన్ని వారు ఆపార్టీ నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల్లో వివిధ ఉత్పత్తుల కోసం వినియోగించే రసాయన వ్యర్థాలను దూరపు ప్రాంతాలకు తరలించకుండా పరిశ్రమల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ట్యాంకర్ల ద్వారా వ్యర్థ రసాయన జలాలను తీసుకొచ్చి విచ్చలవిడిగా జాతీయ రహదారి పక్కన, అలాగే చెరువుల్లో అర్ధరాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా వ్యర్థాలను పారబోస్తున్నారు. ఫలితంగా ఆప్రాంతంలో ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన కొన్ని చెట్లు ఎండిపోతున్నాయని, దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం నియంత్రణం మండలి అధికారుల కనుసైగలతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆరోపించారు. వ్యర్థ రసాయన జలాలను రోడ్ల వెంట, చెరువుల్లో పారపోయకుండా సంబంధిత అధికారులు పటిష్ట మైన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ సహాయ కార్యదర్శి కేతరాజు అంజయ్య, నాయకులు సీమ అంజయ్య, జిల్లా యాదయ్య, సర్గాల అశోక్, బొడిగె లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# అటవీశాఖ ఆధ్వర్యంలో థీమ్ పార్కుల అభివృద్ధి

ఫోటో రైటప్: ఎన్.సాగర్ 3

నాగార్జునసాగర్, జనవరి 28, ప్రభాతవార్త:




ఆకాశాన్ని కారు మబ్బులు కమ్మేస్తుంటూ ఆ అందం వర్ణించరానిది. అటవీ ప్రాంతం, పచ్చని వృక్షాలు, పక్షుల కిలకిలరాగాలు, జంతువుల అరుపులు, నెమళ్ల కురువిప్పిన నాట్యంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. ఉల్లాసంగా గడిపేందుకు సరికొత్త థీమ్‌లతో అర్బన్ పార్క్స్ అధికారులు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. కృష్ణమ్మ అందాలను వీక్షించేందుకు అటవీశాఖ వ్యూపాయింట్‌ను ఏర్పాటు చేస్తోంది. నాగార్జునసాగర్ డివిజన్ నుంచి దిగువున వున్న కృష్ణమ్మ సోయగాలను తిలకించేందుకు చర్యలు తీసుకుంటుంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నెల్లికల్ బీట్‌లో 250 ఏకరాల్లో రూ. 1.5కోట్లతో అర్బన్ పార్కును ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం అందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి.

### ట్రిప్పుకు రూ. వెయ్యి నుంచి రూ. 1500

అడవిలో సఫారీ చేసేందుకు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి 6.30 ని.ల వరకు గంట చొప్పున సమయం కేటాయించారు. పర్యాటకులు అటవీ అందాలను వీక్షించేందుకు సఫారీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఒక ట్రిప్పులో 8 నుంచి 10 మంది వెళ్లనున్నారు. ఇందుకు 10 కి.మీ పరిధికి రూ. వెయ్యి చార్జీ అవుతుండగా 24 కి.మీ పరిధిలో పర్యటించేందుకు రూ. 1500 చార్జీలుగా ఉంది. అడవిలో వివిధ రకాల జంతువులు కనిపిస్తున్నాయని పర్యాటకులు పేర్కొన్నారు.

# రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి



మాజీ ఎంపి డా.బూర నర్సయ్యగౌడ్

**చిట్యాల రూరల్, జనవరి 28, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికలకు బిజెపి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని ప్రతి ఒక్కరూ సమిష్టిగా పనిచేసి పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని భువనగిరి మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. చిట్యాల మండలంలోని నేరడ గ్రామంలో ఆదివారం జరిగిన ఆపార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ఆ పార్టీ అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీలకు అతీతంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్రమోడీని ప్రధానమంత్రిగా ప్రజలందరూ గెలిపించాలని కోరారు. పార్టీ గెలుపుకు పనిచేసే ప్రతి నాయకుడికి,కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.అనంతరం వికసిత్ భారత్ క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డితో కలిసి ఆయన విడుదల చేశారు. ఆ పార్టీ చిట్యాల మండల అధ్యక్షులు పొట్టపల్లి నర్సింహ్మాగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ మైల్ల నరసింహ, కో కన్వీనర్ మాదరి ప్రభాకర్‌రావు, మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు పాపని వనజ వాసుదేవ్, నాయకులు గంజి గోవర్ధన్, వరికుప్పలనర్సింహ్మా, పొట్ట బత్తిని గోపాలకృష్ణ, పొట్టబత్తిని శ్రీను, మిర్యాల మోహన్‌కృష్ణ, కూరెళ్ళ శ్రీను, గుండాల నరేష్‌గౌడ్, అంశల అనిల్‌కుమార్, కన్నెబోయిన మహా లింగం, మాస శ్రీను, పోషబోయిన గిరి, మిర్యాల వెంకన్న, కమ్మంపాటి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



## లచ్చయ్యలేని లోటు కుటుంబానికి తీరని లోటు

....మాజి మార్కెట్ చైర్మన్ భుజంగరావు

పెన్‌పహాడ్,28జనవరి,ప్రభాతవార్త:

మండల కేంద్రానికి చెందిన వగ్గు లచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందగా , ఆయన పార్థీవదేహానికి మాజి మార్కెట్ చైర్మన్ తూముల భుజంగరావు పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.సంతాపం తెలిపినవారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూముల సురేష్‌రావు, మాజి ఉప సర్పంచ్ వగ్గు సైదులు, శివ నాయక్, క్రాంతి, తదితరులు ఉన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి

*మిర్యాలగూడ రూరల్, జనవరి 28 ప్రభాతవార్త*

గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నూకపంగ విక్టోరియాశ్రీనివస్ అన్నారు. అదివారం మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలో టిడిపి పార్టీ అనుబంధ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంగరాల మట్టయ్య అధ్వర్యంలో బానుశ్రీ హాస్పిటల్స్ అర్తో స్పెషలిస్ట్ డాక్టర్ మహేష్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన యువకులు, మహిళలు, రైతులు, వ్యవసాయ కూలీలు వైద్య శిబిరంలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు దైద సంజీవరెడ్డి మాట్లాడుతూ గూడూరు గ్రామంలో ప్రతివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సదుపాయాలను కల్పించేందుకు ముందుకు వస్తున్న స్వచ్ఛంద సంస్థలకు, వివిధ రాజకీయ నాయకులకు అయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కట్టెబోయిన




వెంకటరమణవెంకన్నయాదవ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కట్టెబోయిన రామలింగయ్యయాదవ్, చిమట నాగయ్య, ముసలయ్య, ఏడుకొండలు, నిర్వాహకుడు నాగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ మహేష్‌ను గ్రామ యువకులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

# సమాజ అభివృద్ధిలో ఉద్యోగ సంఘాలు పాలుపంచుకోవాలి

### -మిర్యాలగూడ ఎమ్మెల్యే బిఎల్అర్

*మిర్యాలగూడ, జనవరి 28 ప్రభాతవార్త*

సామాజిక స్పృహతో సమాజ అభివృద్ధిలో ఉద్యోగ సంఘాలు పాలుపంచుకోవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బిఎల్అర్) అన్నారు. అదివారం స్థానిక అంబేద్కర్ షెడ్యూల్ కులాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్వర్యంలో 2024 కాలమానిని డైరీని అవిష్కరించారు. అనంతరం సంఘం డివిజన్ అధ్యక్షులు మాద్గుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.అర్.అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం దేశ సమగ్రత, సమైక్యతలను పటిష్టపరచడంతో పాటు, విద్యతోనే వ్యవస్థలో మంచి మార్పులు సాధించవచ్చునన్నారు. ఉద్యోగులు సంఘటితంగా తమ హక్కుల సాధన కొరకు పనిచేయడంతో పాటు సామాజిక సేవలో పాల్గొనాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ వారికి సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ సలహాదారు కవి రావిరాల అంజయ్య వ్యాఖ్యాత వహించగా కార్యదర్శి కొత్తపల్లి బాబురావు, మాజీ జడ్పిటిసి దోసపాటి శ్రీనివాస్, ఎంపిటిసిలఫోరం జిల్లా ప్రధానకార్యదర్శి బెజ్జం సాయి, జిల్లా



నాయకులు కత్తుల మహేష్, జైపాల్‌గొల్లపూడి, రాష్ట్ర నాయకులు కందుల సందీప్, సింగం శ్రీనివాస్, కోడిరెక్క శైలజ, పేరపాక కృష్ణ, గుడిపాటి శ్రీరాములు, వలంపట్ల మధుబాబు, దివాకర్, రాంబాబు, అమోస్, మట్టయ్య, అడ్విన్, గోపయ్య, వెంకులు, రాయిరాల అనిల్, చింత యాదయ్య, కత్తుల శోభన్‌బాబు,రెమిడాల పరుశురాములు, కోడిరెక్క మల్లయ్య, దేశబోయిన నరేందర్, చంద్రశేఖర్, గడ్డం విజయ్‌కుమార్, చింతల శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే నా శ్వాస

### ధ్యాస: సర్పంచ్ వెంకటరమణచౌదరి

*శ్రీనివాస్‌నగర్(మిర్యాలగూడరూరల్), జనవరి 28 ప్రభాతవార్త*

తన గ్రామమే తనకు సర్వస్వమని, గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు ఎలాంటి పదవులు లేకున్నా వారి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ గ్రామ సర్పంచ్ బోగవెల్లి వెంకటరమణచౌదరి(బాబి) అన్నారు. గ్రామపంచాయతీ పాలకమండలి పదవీకాలం ముగింపు సందర్భంగా అదివారం శ్రీనివాస్‌నగర్ అభివృద్ధి ఫోరమ్ అధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరమణచౌదరి మాట్లాడుతూ శ్రీనివాస్‌నగర్ మొదటి సర్పంచ్‌గా గ్రామ ప్రజలు తన కుటుంబ సభ్యులుగా భావించి ప్రజా భాగస్వామ్యం, అధికారుల సహకారంతో పంచాయతీ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులతో పాటు తన సొంత నిధులను గ్రామాభివృద్ధి వినియోగించి ప్రణాళికబద్ధంగా ప్రాధాన్యత క్రమంలో గ్రామ మౌళిక వసతుల కల్పనతో పాటు, యువత సంక్షేమం, స్వయం ఉపాధి



కొరకు పనిచేశానన్నారు. గ్రామపంచాయతీని మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ కేటగిరిలో సుమారు 20 అవార్డులతో అగ్రభాగాలు నిలిపిన తనకు పాలకమండలి అందించిన సహకారం మరువలేనిదన్నారు. గ్రామాభివృద్ధి కొనసాగింపులో తన సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సుజాతబాలునాయక్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి గజ్జెల అనితారెడ్డి, వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నుండి చిరిగిరి సాగర్ బహిస్కరణ

### కాంగ్రెస్ పార్టీ నుండి చిరిగిరి సాగర్ బహిస్కరణ

*ఆలేరు ప్రభాతవార్త:*

కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సిరిగిరి సాగర్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నామని పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుగ్గ నరేష్ అన్నారు. శనివారం ఆలేరు మండలం శర్బనపురం గ్రామంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏఆర్పటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన బీర్ల ఐలయ్యకు ఓటు వెయ్యొద్దని ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతకు ఓటు వేసినట్లయితే మంత్రి పదవి వస్తుందని, అప్పుడు ఆలేరు ప్రజలు బాగుంటారు, అందుకు డబ్బులు మీకు ఇంత కావాలి అంటే అంత ఇస్తామని దుష్ప్రచారం చేస్తూ ఆధారాలతో దొరకగా జిల్లా అధిష్టానం ఆదేశాల మేరకు గ్రామ శాఖకు సమాచారం ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ ఉండి సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ



కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గడ్డమీది నరేష్, మాజీ సర్పంచ్ సీత శ్రీహరి, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు వట్టపు వెంకటేష్, మాజీ పాల సెంటర్ చైర్మన్ సైదాపురం సురేష్, పార్టీ సీనియర్ నాయకులు కారే రమేష్, రామచెర్ల నర్సింగరావు, సిరిగిరి సారయ్య, బుగ్గ మహేందర్, వటపు శ్రీశైలం, బొడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# బంజారా అఫిషియల్ క్యాలెండర్,డైరీ అవిష్కరణ

*మిర్యాలగూడ రూరల్, జనవరి 28 ప్రభాతవార్త*



బంజారా సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా బంజారా అఫిషియల్ క్యాలెండర్,డైరీ తయారు చేయబడిందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బిఎల్అర్), నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డిలు అన్నారు. అదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బంజారా ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో రూపొందించబడిన డైరీ, క్యాలెండర్‌ను వారు అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు శంకర్‌నాయక్, రాష్ట్ర నాయకులు స్కైలాబ్‌నాయక్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్, గోపినాయక్, ఎస్ఐ శ్రీనునాయక్, శ్రీనివాస్, సైదా, విజయ్, తిరుపతినాయక్, పార్వతిచౌహాన్, ధర్మానాయక్, నానిక్య, సిద్దు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, సారెడ్డి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర వేడుకలు నిర్వహించలేదనడం అవాస్తవం

### .వ్యవసాయ అధికారిణి పార్వతి చౌహాన్

*త్రిపురారం,28జనవరి,ప్రభాతవార్త:*

మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించలేదనడం అవాస్తవమని మండల వ్యవసాయ అధికారిణి పార్వతి చౌహాన్ అన్నారు ఆదివారం ఆమె "ప్రభాతవార్తతో " మాట్లాడుతూ ఈ నెల 27న వార్త జిల్లా సంచికలో "వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎగరని జెండా"అనే కథనానికి ఆమె వివరణ ఇస్తూ ఎన్ఎస్‌పి క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న మండల వ్యవసాయ కార్యాలయం శిధిలావస్థలో ఉన్నందున ప్రత్యామ్నాయంగా పెద్ద దేవులపల్లి వ్యవసాయ క్లస్టర్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో తాను పాల్గొని జెండా ఆవిష్కరించినట్లు తెలిపారు. జెండా ఆవిష్కరణ విషయమై "ప్రభాతవార్త" తనను ఫోన్‌లో సంప్రదించగా, స్విచ్ఆఫ్ అనే మాట ప్రచురించారు. నా ఫోన్ ఎప్పుడూ మనుగడలోనే ఉంటుందన్నారు. తన విధులపట్ల తాను ఎలాంటి అలసత్వం ప్రదర్శించలేదని ప్రభుత్వ మార్గదర్శకాలమేరకు రైతుల సేవలో వ్యవసాయ శాఖ ముందుంటుందన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపట్ల సమన్వయంతో వ్యవహరిస్తానన్నారు.

# అంకితభావంతో పని చేసినప్పుడే గుర్తింపు లభిస్తుంది

*తుంగతుర్తి,28జనవరి,ప్రభాతవార్త:*



ఉద్యోగరీత్యా పదే ప్రజలకు అంకిత భావంతో పని చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బదిలీపై సూర్యాపేట టౌన్ వన్‌కు వెళుతున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌ను పలువురు జర్నలిస్టులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైనీలో కూడా తుంగతుర్తికి విచ్చేసి సేవలు అందించానని, తిరిగి అనతికాలంలోనే ఎస్‌గా ఇక్కడికి వచ్చి సేవలందించడం ప్రతి ఒక్కరి అభిమానాన్ని పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్లు ఓరుగంటి శ్రీనివాస్, గుండగాని రాము, విజ్జి నాయక్, వెంకన్న నాయక్, పాల్గొన్నారు.




# ఘనంగా మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకళ్యాణం

**మఠంపల్లి జనవరి 28 ప్రభాతవార్త**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి లక్ష్మినరసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మిసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకళ్యాణంను అర్చకులు శాస్రోక్తంగా ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ ంలో ప్రత్యేకపూజలు నిర్వహించి కళ్యాణతంతు కార్యక్రమాన్ని వందల ాదిమంది భక్తుల నడుమ అర్చకులు శాస్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కళ్యాణాన్ని తిలకించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు వి జయ్‌కుమార్, మట్టపల్లిరావు, కార్యనిర్వహణ అధికారి సిరికొండ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణచార్యులు, లక్ష్మినర్సింహ మూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీ కులగణనపై నిర్ణయం తీసుకుంటామని సీఎం ప్రకటన పట్ల హర్షం

**మోత్కూర్ ప్రభాతవార్త:**



బీసీ కులగణనపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ.. దశాబ్దాలుగా మారుతున్న బీసీ తలరాతలు మారటం లేదన్నారు. బీసీ కులగణన చేయడం ద్వారా రాష్ట్ర బీసీల జనాభా ఎంతో ఉందో తెలియడమే కాకుండా బీసీలు రానున్న ఎన్నికల్లో ఈ రిజర్వేషన్ల ద్వారా ప్రజాప్రతినిధులు ఎన్నికై రాజ్యాధికారం దిశగా సాధించుకోవడానికి మంచి అవకాశాలు ఉంటాయన్నారు. దీనికి తోడు బీసీలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రవేశ పెట్టే బడ్జెట్ ద్వారా బీసీలకు రుణా సదుపాయాలతో ఉపాధి పొందవచ్చునన్నారు. బీఆర్ఎస్ఎస్ పట్టణ అధ్యక్షుడు నిలిగొండ మత్స్యగిరి, ఇబ్రహీం పాల్గొన్నారు.

## ఆర్‌పీ పట్నాయక్ చేతులమీదుగా సేవరత్న పురస్కారం అందుకున్న నవీన్

**మోత్కూర్ ప్రభాతవార్త:**



జనయేత్రి ఫౌండేషన్ మిర్యాలగూడ వారిచే తృతీయ వార్షికోత్స వం సందర్భంగా మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కురిమేటి నవీన్ సేవలను గుర్తించి వారికి ప్రశంసా పత్రం ఆదివారం తెలుగు చిత్ర పరిశ్రమ మ్యూజిమ్ డైరెక్టర్ ఆర్‌పీ పట్నాయక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సంస్థ కొన్ని వందల మందికి సహాయం చేయడం జరుగుతుందని, దీనికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ అవార్డు అంకితం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా డాక్టర్ సంపత్ కుమార్ వరల్డ్ రికార్డ్ దాత 294, సమాజ సేవకురాలు కర్నే శిరీష, కుమారి దుర్గా లావణ్య పారాషూట్ ఆయుర్వేదిక్ హెయిర్ ఆయిల్ బ్రాండ్ అంబాసిడర్ 2020, డాక్టర్ సకీజ ఖాన్, జనయేత్రి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మున్నీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు

**అడ్డగూడూరు ప్రభాతవార్త:**

మండల కేంద్రానికి చెందిన విలేకరి గూడెపు పరమేష్‌పై కేసు నమోదైనట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మండల కేంద్రంలో గత ఏడాది డిసెంబర్ 1న బాల ఉగ్ర నరసింహస్వామి వైన్స్‌ను ప్రభుత్వ అనుమతితో ప్రారంభించారు. ఆ దుకాణంలో చిర్రగూడూరు గ్రామానికి చెందిన బండి సాయి క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఓ సంస్థలో పనిచేస్తున్న విలేఖరి గూడెపు పరమేష్ వైన్స్ వద్దకు వెళ్లి రూ.75వేలు ఇవ్వాలని బెదిరించాడు. ఇవ్వకపోతే మీ షాప్‌ని ఏలా నడిపిస్తారో చూస్తానని డిమాండ్ చేశారని ఎస్ఐ పేర్కొన్నారు. దీంతో భయపడిన క్యాషియర్ ఆన్‌లైన్‌లో రెండు దఫాలుగా రూ.75వేలు పంపాడు. ఈనెల 27వ తేదీన బాధితుడు సాయి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి ఆదివారం పరమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

## నాగారం ఎస్ఐ బదిలీ

**నాగారం ప్రభాతవార్త:**

నాగారం మండల ఎస్ఐగా పనిచేస్తున్న ఎర్ర సైదులు గౌడ్ ఆదివారం బదిలీ అయ్యారు. ఈయన ఆత్మకూర్(ఎస్) మండల ఎస్ఐగా బదిలీపై వెళ్లనున్నారు. కాగా నాగారం మండల నూతన ఎస్ఐగా ఇంకా ఎవరిని నియమించలేదు.

## మృతుడి కుటుంబానికి పరామర్శించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల

**మోత్కూర్ ప్రభాతవార్త:**



మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ ఎర్రవెల్లి మల్లమ్మ యాదయ్య కుమారుడు ఎర్రవెల్లి పరుశరాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని పరమర్శించి, ఆయన పిల్లలపై చదువుల్లోకై హామీ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు పైళ్ల సోమిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, కొండగడప గ్రామ శాఖ నాయకులు మోహనాచారి, కస్తూరి వీరస్వామి, ౯ వింగ్ శ్రీకాంత్ గౌడ్, అడ్వకేట్ యుగంధర్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు వెంకట్ కారుపోతుల, మందుల సురేష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు చెడే అంబేత్కర్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పిఏసిఎస్ చైర్మన్‌కు బాల్యమిత్రుల సన్మానం

**నూతనకల్,28జనవరి,ప్రభాతవార్త:**

మండల పిఏసిఎస్ చైర్మన్ జయసుధ సుధాకర్‌రెడ్డి చిన్ననాటి బాల్యమిత్రులు 1993-94 పదవ తరగతి బ్యాచ్‌వారు ఆదివారం చైర్మన్ దంపతులను వారి నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ మిత్రుడు ఇలా ఉన్నతమైన పదవులను చేపట్టడం తమకు ఎంతో గర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సన్మాన కార్య క్రమంలో బాల్య మి త్రులు బొడ్డుపల్లి అం జయ్య, మాతంగి వెంకన్న, వెంక ట్‌రెడ్డి,నోముల వెంకట్‌రెడ్డి , ఉపేందర్, ఒంగూరి రమేష్ ,అబ్బాస్ అలీ, కొలిచెల్మ మ ఉపేందర్, బూనాల శ్రీనివాస్‌రెడ్డి,అనిల్ ,రాధాకృష్ణ, చందనబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## రూరల్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సతీష్

**మిర్యాలగూడ క్రైం, జనవరి 28 ప్రభాతవార్త**



మిర్యాలగూడ రూరల్ ఎస్ఐగా గోపతి సతీష్ అదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన నర్సింహులుగౌడ్ బదిలీపై నల్లగొండకు వెళ్లడంతో అయన స్థానంలో సతీష్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. 2020 బ్యాచ్‌కి చెందిన సతీష్ హైద్రాబాద్, సూర్యాపేట ఎస్పి కార్యాలయంలో ఐటి సెల్‌లో పనిచేస్తూ బదిలీపై మిర్యాలగూడ రూరల్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో మిర్యాలగూడ మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**అడ్డగూడూరు ప్రభాతవార్త:**



అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామంలో పర్యటించిన స్థానిక శాసనసభ్యులు మందుల సామేలు పర్యటనలో భాగంగా ఆదివారం గ్రామంలో రూ.5లక్షలతో వేసిన సిమెంటు రోడును, నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలం జ్యోతి దావీద్, మండల పార్టీ అధ్యక్షులు పొలేబోయిన లింగయ్య యాదవ్, కాంగ్రెస్ నాయకులు నిమ్మనగోటి జోజి, మందుల జాని, పూర్ణ నాగయ్య, చారి పాల్గొన్నారు.

## సర్పంచ్‌ను సన్మానించిన గ్రామపంచాయతీ సిబ్బంది

**నాగారం ప్రభాతవార్త:**



మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో ఈనెలాఖరుతో సర్పంచ్ పదవి కాలం ముగుస్తుండటంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పసుపులేటి ప్రేమలత వెంకట్ రెడ్డిని, ఉపసర్పంచ్ వడ్డే మహేష్, వార్డు సభ్యులను గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాసేవ చేసిన వారికి ఎల్లప్పుడు గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సంతోష, ఆశ కార్యకర్త జయమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ మణెమ్మ, మరియమ్మ, లక్ష్మి, చంద్రకళ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు కాలుష్యం నీళ్ళు, కంపెనీలకు కృష్ణ నీళ్లు

## -సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి.జాంగిర్



భూదాన్ పోచంపల్లి ప్రభాతవార్త:

ప్రజలకేమో కాలుష్యం నీరును అందిస్తూ, కంపెనీలకు కృష్ణ నీళ్ళను అందిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి.జాంగిర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పోచంపల్లి మండల కమిటీ సమావేశం కోట చంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ.. పోచంపల్లి మండలంలోని గ్రామాలలో ఉన్న ప్రజలకు కలుషితమైన నీటిని ఇస్తూ కృష్ణా జలాల నీటిని మండల పరిధిలోని దోతి గూడెంలో గల కంపెనీలకు అందిస్తున్నారని అన్నారు. మూసి ఇప్పటికే అనేక వివిధ పదార్థాలను వదులుతూ ఉండడంతో మొత్తం నీరంతా కలిసితమై ఉందని, దానిమీద సైంటిస్టులు అనేక పరిశోధనలు చేయగా మీరు ప్రాంతం మొత్తం జల కాలుష్యంతో నిండిపోయిందని నీటిలో సీసం తయారయ్యి దాని వల్ల చర్మవ్యాధులు కిడ్నీ వ్యాధి గుండె వ్యాధులు అనేక వస్తున్నాయని సైంటిస్టులు చెప్పిన కూడా ఏమాత్రం పట్టించుకోకుండా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు కృష్ణ, గోదావరి జాల్లాలను అందించాలని, గ్రామాలలో ఇంటింటికి పేరుకేనల్ల కలెక్షన్లను ఇచ్చారు. కానీ గ్రామ ప్రజలకు అందించవలసిన నీరును నేరుగా కంపెనీలకు అందిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలకు కృష్ణ గోదావరి జలాల నీరును వెంటనే అదించాలని వారు డిమాండ్ చేశారు. వీటితో పాటు ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, పార్టీ మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాదం విష్ణు, గూడూరు బుచ్చిరెడ్డి, చమంచాల మధు, మండల కమిటీ సభ్యులు నెలకంటి జంగయ్య పాల్గొన్నారు.

# విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకు రూ.1లక్ష విరాళం



రాజాపేట ప్రభాతవార్త:

రాజాపేట ఉన్నత పాఠశాల 1977-78 ఎస్ఎస్‌సి చదివిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న, క్రమశిక్షణ నేర్చుకున్న పాఠశాలకు రూ.1లక్ష ప్రకటించి ప్రధానోపాధ్యాయులు బూర్గు మహేందర్ రెడ్డికి అందజేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పాఠశాలకు అవసరమైన సదుపాయాలను కల్పించుకొని ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు మరింత నాణ్యమైన క్రమశిక్షణ విద్యను వారు కోరారు. రాజాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు, అంతేకాకుండా తమకు గురువులకు రుణపడి ఉంటామని అన్నారు. పాఠశాల స్థాయిలో మంచి స్నేహితులు లభించారిన, 56 సంవత్సరాల నుండి కలసి శుభ, అశుభ కార్యక్రమాలకు కూడా హాజరవుతున్నాట్లు ఒకే కుటుంబంగా కొనసాగుతున్నట్లు చెప్పారు. తోటి స్నేహితులకు అవసరమైన సహాయం సహాకారం కూడా అందించుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి వెంకటేశం, డి.సుదర్శన్, అరె బాలస్వామి, సత్యలక్ష్మి, విజయలక్ష్మి, లలిత, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గుండాల ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91 సంవత్సరంలో పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి విద్యార్థులు నేడు పాఠశాలలో కలుసుకొని చదువుకున్న తరగతి గదులు, కూర్చున్న ప్రదేశాలు బోధించిన ఉపాధ్యాయుల సమక్షంలో ఆడుతూ పాడుతూ ఘనంగా కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆమీజ మండల విద్యాధికారి గార్లపాటి సోమిరెడ్డి మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు క్రమశిక్షణ బోధించిన విధానం అలవర్చుకొని మేము ఆశించిన స్థాయిలో స్థిరపడ్డారని అభినందించారు. పుట్టి పెరిగిన గ్రామం, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను మరవకుండా వారి వారి స్థాయిలో స్థిరపడి ఈ పాఠశాలకు, పుట్టి పెరిగిన గ్రామానికి, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం చదువుచెప్పిన ఉపాధ్యాయులను జ్ఞాపిక శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ పూర్వ విద్యార్థులచే పాఠశాల ముందు దాదాపుగా రూ.లక్షతో ఆర్చి నిర్మించి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు చనిపోయిన ఉపాధ్యాయులను, విద్యార్థులను స్మరించుకున్నారు. మోతే నర్సిరెడ్డి, ఏ.రామచంద్రయ్య, జువాజి నారాయణ, గజ్జి రాములు, విద్యార్థులు ఎం.సోమయ్య, జి.సోమయ్య, ఎండి.సర్వర్, జే.యాకస్వామి, సోమయ్య, యాకూబలి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# మదన దుర్గ ఆలయములో ప్రభుత్వ విఫ్, సతీమణి ప్రత్యేక పూజలు

తుర్కపల్లి ప్రభాతవార్త:

తుర్కపల్లి మండల పరిధిలోని గంధమల్ల శివారులో గల మదనదుర్గ దేవాలయంలో ఆదివారం ప్రభుత్వ విఫ్, బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల అనిత, పదవ తరగతి స్నేహితులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో గంధముల గ్రామంలో స్నేహితులతో కలిసి ప్రచార నిర్వహించినప్పుడు మదన దుర్గ దేవాలయం వద్ద మొక్కుకున్నట్లు తెలిపారు. మొకులో భాగంగా ఆదివారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి స్నేహితులు శ్రీలత, కవిత, నవనీత, సబితా, జంగమ్మ, వాణి, నల్లమాసు బలరాం, పాక జహంగీర్ యాదవ్, కస్తూరి రమేష్, గడసాందుల పాండు, గడసాందుల కృష్ణ, ఈరబోయిన మహేష్, పాక నగేష్, చిన్నం దానయ్య, రవి, సత్తయ్య, పండు రంగం, సిరికొండ శ్రీను, ప్రభాకర్, సిరికొండ అశోక్, మాటూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.






# అండర్ పాస్ పనులు పరిశీలన చేసిన టీపీసీసీ ఓబీసీ కార్యదర్శి

ఆలేరు ప్రభాతవార్త:



ఆర్ఓబి అండర్ పాస్ పనులను త్వరగా పూర్తి చేయాలని టీపీసీసీ ఓబీసీ కార్యదర్శి ఎగ్గిడి శ్రీశైలం అన్నారు. శనివారం అండర్ పాస్ పనులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఆర్ఓబీ అండర్ పాస్ పనులు నిర్లక్ష్యం చేసి ప్రజలను ఇబ్బందిలకు గురి చేశారని, రోడ్డు భవనాల, శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విఫ్ బీర్ల ఐలయ్య సహకారాలతో పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్గిడి లక్ష్మణ్, శ్రీనివాస్, జెట్టా సిద్ధులు, ఎమ్మా భాస్కర్, ఎస్‌కే.హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈరశరపు యాదగిరి గౌడ్ ఘనంగా సన్మానం

ఆలేరు ప్రభాతవార్త:



ఆలేరు నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరశారపు యాదగిరి గౌడ్‌ను కలిసిన ఆలేరు యూత్ మండల అధ్యక్షులు ఉట్కూరి సురేష్ ఎన్నికైన సందర్భంగా హర్ధిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పల్లె సంతోష్, జనరల్ సెక్రెటరీ కర్రే అజయ్ కుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కాంద్రాజు శివశంకర్, జిల్లా యూత్ నాయకుడు పర్రే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ఆలేరు ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణను యాదాద్రి భువనగిరి జిల్లా కోఆర్డినేటర్ బండారి ప్రసాద్ ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు డిఎస్‌పి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం శంషాబాద్‌లోని వీజెర్ కన్వెన్షన్ హాలులో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఉద్యోగ సంఘాలు నుండి హాజరయ్యారని ఉద్యోగులు సమస్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు.



# కంకర వేశారు..తారు రోడ్డు నిర్మాణం మరిచారు

*నేరేడుచర్లటౌన్ జనవరి 28 ప్రభాతవార్త*



నేరేడుచర్ల మున్సిపాల్టీపరిధిలో రహదారుల విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా కంకర నిర్మాణం చేపట్టి తారురోడ్డు నిర్మాణంలో జాప్యం చేస్తుండటంతోప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానిక మున్సిపాల్టీపరిధిలో సుమారు రూ.15 కోట్లతో జాన్‌పహాడ్ రోడ్డు, రామాపురం రోడ్డు, మున్సిపాల్టీరోడ్లను విస్తరణ చేపట్టి రహదారికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం, విద్యుత్ లైట్ల నిర్మాణ పనులను సుమారు సంవత్సరం క్రితం చేపట్టారు. ఈ మూడు రహదారుల్లో మురుగు కాలువల నిర్మాణం చేపట్టి తారురోడ్డు విస్తరణ పనులను జాప్యం చేస్తున్నారు. కొన్నిచోట్ల కంకర నిర్మాణ పనులను కూడా అసంపూర్తిగా నిర్మించారు. దీంతో రహదారికి మురుగు కాలువ ఎత్తుగా ఉండటంతో దుకాణాలలోకి, గృహాలలోకి ప్రజలు వెళ్లలేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం ఉన్న తారురోడ్డుపైనుండి వాహనాలు వెళుతుండటంతో పాదాచారులు కంకరపై నడిచి వెళ్లాల్సి వస్తుండటంతో కంకర పాదాలకు గుచ్చుకుంటుండటంతో ప్రజలు, ఆయా దుకాణదారలు అవస్థలకు గురవుతున్నారు. దుకాణాల ముందు కంకర ఉండటంతో ద్విచక్రవాహనాలను కూడా పార్కింగ్ చేసుకోలేకపోతున్నామని పలువురు వినియోగదారులుఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాల్టీ రహదారిలో కంకరవేసి నెలలు గడుస్తున్నా తారురోడ్డు నిర్మించడంలో తీవ్రమైన జాప్యం చేస్తున్నారు. రహదారి విస్తరణపనులలో దుకాణాలను కూల్చివేసినంత వేగంగా డ్రైనేజీ నిర్మాణం, తారురోడ్డు నిర్మాణం, విద్యుత్ లైట్ల నిర్మాణం చేపట్టకపోవడం, విస్తరణ పనులు చేపట్టి సంవత్సరం గడుస్తున్నప్పటికీ నత్తనడకన నిర్మించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా ఉండటంతో తమ వాపారం దెబ్బతింటుందని పలువురు వ్యాపారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని రహదారి విస్తరణ పనులు త్వరగాపూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# సాగర్ నీటిని విడుదల చేయాలి

## నీటి విడుదలను ప్రకటించాలి

*గరిడేపల్లి జనవరి 28 ప్రభాతవార్త*




నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లో 520 అడుగుల నీరు ఉండి కూడా ఆయకట్టుపరిధిలో వేసిన పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం చూసీ చూడనట్లు ఉండటం సమంజసందని వెంటనే నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రకటించి పంటలను కాపాడాలని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆదివారం గరిడేపల్లి మండలకేంద్రంలో జరిగిన సిపిఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నీళ్లు ఇస్తుందనే ఆశతో ఎకరాకు రూ.30వేలు ఖర్చుచేసిపంటలు వేసుకున్నారని, ఇప్పటి వరకు బావులు, బోర్లతో పంటలు తడుపుకున్నారని, రానురాను భూగర్భ జలాలు అందుగంటడంతో బావులు ఎండిపోయాయని,బోర్లు తగ్గి వేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న గాక మొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాగర్ నీటినుండి 5 టిఎంసిల నీటిని 10రోజులు తీసుకున్నారని, అయినా తెలంగాణ ప్రభుత్వం మనకు నీళ్లు కావాలని కోరకపోవడం అన్యాయం అన్నారు. సాగర్ ఆయకట్టుపరిధిలో చెరువులు, కుంటలు,బావులు మొత్తం ఎండిపోయాయని వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని, పంటలు ఎండిపోతే పశువులకు మేత కూడా కరువైతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, సిపిఐ మండల కార్యవర్గసభ్యులు యడ్ల అంజిరెడ్డి, ఏఐవైఎఫ్ నాయకులుమెండె లింగరాజు, చామకూరి కాశయ్య, శోంఠి వెంకన్న, యాసరపు పున్నయ్య, ప్రధాని సైదులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సిమెంట్ బల్లలు ఏర్పాటు

*నేరేడుచర్లటౌన్ జనవరి 28 ప్రభాతవార్త*




నేరేడుచర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త, క్లబ్ సభ్యులు రావులపల్లి ప్రసాద్ దంపతులు రూ.10వేల ఆర్థికసహాయంతో 4 సిమెంట్ బల్లలను మున్సిపాల్టీపరిధిలో ఆదివారం ఏర్పాటు చేశారు. మున్సిపాల్టీ కార్యాలయంలో, పాత నేరేడుచర్ల రామాలయం వద్ద, భారత్ పెట్రోల్‌బంక్ ఎదురుగా, పోస్టాఫీస్ బజార్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాల్టీపరిధిలో వృద్ధులకు రద్దీ ఉన్న ప్రాంతాలలో గుర్తించి ఏర్పాటుచేసినట్లు, ఈ సిమెంట్ బల్లలకు ఆర్థిక సహాయం అందించిన రావులపల్లి ప్రసాద్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, ఛార్టర్ కార్యదర్శి రాచకొండ రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు గుండా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రూ.5లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభం

*హుజూర్‌నగర్‌టౌన్ జనవరి 28 ప్రభాతవార్త*



హుజూర్‌నగర్ పట్టణంలోని 4వ వార్డులో సిసిరోడ్డు పనులకు ఆ వార్డ్ కౌన్సిలర్ ఒరుగంటి నాగేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్‌రావులు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ పార్లమెంట్ సభ్యులుగా ఉన్నపుడు 4వ వార్డులో మానస సరోవరం అపార్ట్‌మెంట్ వద్ద రహదారి నిర్మాణం కోసం సిసి రోడ్డుకు రూ.5 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో అవినీతి, అక్రమాలకు తావులేకుండా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా అభివృద్ధి పనులు జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ సభ్యులు కొత్తపల్లి శివరామరాజు, బోనాల సాగర్, దాస శ్రీనివాసరావు, చల్ల వీరయ్య, కొండా రమేష్, గంజి శివ తదితరులు పాల్గొన్నారు.

# రేపు మండలానికి ఎమ్మెల్యే జయవీర్ రాక

*త్రిపురారం,28జనవరి,ప్రభాతవార్త:*



నాగార్జున సాగర్ శాసన సభ్యులు కుందూరు జయవీర్‌రెడ్డి ఈ నెల 30న మండలంలో పర్యటించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముడిమాళ్ల బుచ్చిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న ఉదయం 9గంటలకు కాంప్రవారిగూడెం,10గంటలకు లచ్యతండా, 11గంటలకు నీలాయిగూడెం గ్రామాలలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాల ప్రారంభోత్సవంతో పాటు మద్యాహ్నం 12గంటలకు మండల కేంద్రంలో రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి ,షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.




# సోమవరం ఉన్నతపాఠశాలకు మైక్‌సెట్ బహుకరణ

*నేరేడుచర్లటౌన్ జనవరి 28 ప్రభాతవార్త*



నేరేడుచర్ల మండలం సోమవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు శుక్రవారం 1997-98 సంవత్సరం 10వ తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు సుమారు రూ.15వేల విలువగల మైక్‌సెట్‌ను ప్రధానోపాధ్యాయులు ఆర్.శ్రీనుకు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, నేరేడుచర్ల మండల యూత్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు దోరెపల్లి రవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రభుత్వ బడుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ బడులను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహ్మద్ మొయిజ్, గడగోజు విజయ్,ఆర్‌అండ్‌బి డిఈ పవన్‌కుమార్,జానకిరాములు, రహీమ్, సోమయ్య, బాజీ, మహమూద్, కిరణ్, వెంకన్న, సోమ్లు, పాండు తదితరులు పాల్గొన్నారు.

# సోమప్ప దేవాలయానికి రూ.35వేల విలువ గల 12 బెంచీలు బహుకరణ

*నేరేడుచర్లటౌన్ జనవరి 28 ప్రభాతవార్త*



నేరేడుచర్ల మండలం బూర్గులతండా గ్రామపంచాయితీపరిధిలోని చారిత్రాత్మక సోమప్ప దేవాలయానికి ఆదివారం రూ.35వేల విలువ గల 12 సిమెంట్ బెంచీలను దాతలు బహుకరించారు. సోమప్ప దేవాలయ అభివృద్ధి కమిటి చైర్మన్ రాచకొండ శ్రీనివాసరావు, వాసవి క్లబ్ వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, మహాలక్ష్మి ఇండస్ట్రీస్ గుంటూరు ఈశ్వరమ్మ, తిరునగరి రోజారాణిలు బెంచీలను విరాళంగా ఇవ్వగా నేడు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ రాచకొండ శ్రీని వాసరావు, సభ్యుడు లక్ష్మినారాయణ, మాలోతు నాగు, వీరప్ప, పెద్దపంగు అజయ్, పెద్దపంగు ప్రవీణ్, అఖిల్, షేక్ రహీముద్దీన్, సౌంద్‌మీయా, కె.కృష్ణారావు, సత్తార్, దొరపల్లి రవి, గోపి, వినోద్, వెంకటేశ్వర్లు, వెంకటరమణనాయక్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సూర్యసహస్రనామ పారాయణములు

*మేళ్లచెరువు జనవరి 28 ప్రభాతవార్త*

స్థానిక శ్రీగోదా భూనీళ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో, శ్రీఇష్టకామేశ్వరి సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామివారి ఆలయంలో, శ్రీనగర్ కాలనీలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సందర్భంగా సూర్యసహస్రనామ స్తోత్రపారాయణములు, అర్చనలు, అభిషేకములు, హారతులు, గుడిసేవలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో కొంకపాక శివవిష్ణువర్ధనశర్మ, శివధనుంజయశర్మ, భనుకిరణ్‌శర్మ, సుదర్శనం ప్రసాదాచార్యులు, మోహనకృష్ణమాచార్యులు, నల్లాన్‌చక్రవర్తుల వెంకటప్రసాదాచార్యులు, చెట్లూరి వాసుదేవాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బీసీ కుల గణన పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం హర్షనీయం

### -బీసీ సంక్షేమం సంఘం నేత జూకంటి ప్రవీణ్ కుమార్

రాజాపేట ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే బిసి కులగణన చేపడతామని, ఎన్నికల హామీ మేరకు ఎస్సి, ఎస్టీ, బీసీ, సంక్షేమ శాఖల సమీక్ష సమావేశంలో బీసీ కుల గణన కోసం వేగవంతంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన రాజాపేటలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజాపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు జనాభా లెక్కలు లేకపోవడం మూలంగా అనేక దశాబ్దాలుగా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికే దేశంలో బీహార్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు బీసీలకు గణను ప్రారంభించాయన్నారు. అదే తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా బీసీ కమీషన్ ద్వారా బీసీ కులగణను వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వెనుకబడిన వర్గాలకు సంబంధించి స్పష్టమైన గణాంకాలు వచ్చిన తర్వాతనే జనాభా ప్రాతిపాదికన



రిజర్వేషన్లు కల్పించి గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్, వివిధ ఉద్యోగ పరీక్షల నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా బీసీ మంత్రులతో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి బీసీల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేడిశెట్టి సురేష్, రంగ నరేష్ గౌడ్, రాంగొల్ల శ్రీను, పెద్దోళ్ల ప్రభాకర్, వరిమట్ల కనకయ్య, పుల్లంగారి శేషాద్రి, కాకల్ల భరత్ తదితరులు పాల్గొన్నారు.





## మున్నూరుకాపుకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

హుజూర్‌నగర్‌రూరల్ జనవరి 28 ప్రభాతవార్త



మున్నూరు కాపులకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని హుజూర్‌నగర్ పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు ధూళిపాల శ్రీనివాస్ అన్నారు.ఆదివారం మండలంలోని లింగగిరి గ్రామంలో నూతన గ్రామపంచాయితీ కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పట్టణ మున్నూరు కాపు సంఘం నాయకులు కలిసి ప్రత్యేక ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధూళిపాల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మున్నూరుకాపులు 54 లక్షలమందికిపైగా ఉన్నారని, అందులో అధికశాతం పేద,మధ్యతరగతి, వ్యవసాయకూలీ పనులు చేసుకొని జీవిస్తున్న వారు ఎక్కువ మంది ఉన్నారన్నారు. మున్నూరుకాపు విద్యార్థులకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లాకేంద్రాలలో హాస్టల్ భవన నిర్మాణంకోసం 2ఎకరాల స్థలాన్ని కేటాయించడంతోపాటు రూ. 3కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కొట్టు సురేష్, పోటునాగేశ్వరరావు, రామిశెట్టి మురళిప్రసాద్, ఆకుల రాము, మేకల వెంకటేశ్వర్లు, మేకల రాజారావు, కాసర్ల అప్పాజి, దేవిశెట్టి వేణు, వెంకయ్య, రాజారావు, రాఘవ రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న చల్లాతేజ

తుర్కపల్లి ప్రభాతవార్త:

తుర్కపల్లి మండలం రుస్తాపురం గ్రామంలో జరుగుతున్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, రేణుక ఎల్లమ్మ తల్లి జాతరలో భాగంగా ఆదివారం స్వామివారి కళ్యాణోత్సవంలో కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నాయకులు చల్లా తేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించారు. అనంతరం గ్రామ యువతకు క్రీడా సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వకరి లావణ్య నారాయణ, ఎంపీటీసీ ధనవత్ మోహన్ బాబు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు



గజ్జి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్కూరి సందీప్ గౌడ్, కొండాపురం నరసింహ, బూరుగుమాతయ్య, నీల సునీల్ గుప్తా, నవీన్ చారి, మహేందర్, శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆలేరు ప్రభాతవార్త:

కొలనుపాకలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మండలంలోని కొలనుపాకలో 2002, 2003 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు. నాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరారెడ్డి, కొండల్ రెడ్డి, మధురవాణి, స్వర్ణ కుమారి, విజయలక్ష్మి, సుజాత, పద్మ కుమారి, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు గడ్డం శంకర్, దూడల కృష్ణ, సంపత్ రాజ్,



కోలా కర్ణ, వల్లపు వెంకటేష్, నానవత్తుల వేణు, దిడిగం సందీప్, ఆరుట్ల సుకృత్ రెడ్డి, గుర్రాల శ్రీను, శిరీష, గీత తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర కబడ్డీ కెప్టెన్‌గా సాయి అభిజ్ఞ

తిరుమలగిరి సాగర్, జనవరి 28, ప్రభాతవార్త:



తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన ఉప సర్పంచ్ వాళ్లవాయి అంజయ్య కుమార్తె వాళ్లవాయి సాయి అభిజ్ఞ కడప జిల్లా రాజవరంలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టుకి కెప్టెన్‌గా ప్రతినిధ్యం నిర్వహిస్తున్నారని కోచ్ కాశీ ఉపేందర్ అన్నారు. మండల కేంద్ర ప్రజలు క్రీడాకారులు కబడ్డీలో అమె ప్రతిభను గుర్తించి నైపుణ్యతను పెంచి జాతీయ స్థాయిలో నిలిపిన కోచ్ కాశీ ఉపేందర్‌లను అభినందించారు.

## నేడు రాజాపేట మండల సర్పంచులకు సన్మానం

రాజాపేట ప్రభాతవార్త:

రాజాపేట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులకు ఈనెల 29వ తేదీ సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్ఞానప్రకాశరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులకు వివరాలు చెబుతూ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిపి గోపగాని బాలమణి యాదగిరి గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

## మర్లపాడు గ్రామ మహిళల ఆత్మీయ సమ్మేళనం

వలిగొండ ప్రభాతవార్త:



మండలంలో సుంకిశాల మదిర గ్రామము మర్లపాడులోని నివాస మహిళలు 20 సంవత్సరాల అనంతరం ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఒకరికి ఒకరు కలుసుకొని ఆలింగనం చేసుకొని కష్ట, సుఖలను తెలుసుకొని, ఎవరు ఏ వృత్తిలో స్థిర పడ్డారు, ఆర్థికంగా ఉన్నారా లేరా అని వివరాలు తెలుసుకొని, చిన్న నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకొన్నారు. ఈ సందర్భంగా ఒక ట్రస్టు ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో కంది, కొమిరేల్లి, కొలను, సప్పిడి అనే కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ బీమా చెక్ అందించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల

వలిగొండ ప్రభాతవార్త:



మండలంఒంటలని ఎదుల్లగూడెం గ్రామానికి చెందిన మునుకుంట్ల బాలశెట్టి ఇటీవల మృతి చెందడంతో ఆయనకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండడం చేత పార్టీ సభ్యత్వ బీమా నుండి మంజూరి అయిన రూ. 2లక్షల చెక్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మేడీ నర్సింహా, కొంతం శ్రీను, బాలేశ్వర్, ఉద్దగిరి, భాస్కర్, లింగ స్వామి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిని కలిసిన వలిగొండ నూతన ఎస్ఐ

వలిగొండ ప్రభాతవార్త:

వలిగొండ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన డి.మహేందర్ లాల్ ఆదివారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## బుసిరెడ్డి పౌండేషన్ అధ్వర్యంలో అన్నదానం

తిరుమలగిరి సాగర్, జనవరి 28, ప్రభాతవార్త:



తిరుమలగిరి సాగర్ మండలం లక్ష్మీపురంతండాకు చెందిన అంగోతు పిక్లనాయక్ అదివారం అనారోగ్యంతో మృతి చెందారు. అయన అంత్యక్రియల అనంతరం బుసిరెడ్డి పౌండేషన్ అధ్వర్యంలో పౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అర్థకంగా ఇబ్బందులు పడుతున్న ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటానని అయన హమీ ఇచ్చారు. అపద సమయంలో 9581742356 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలి

జమ్మికుంట, ప్రభాత వార్త:

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిఎస్పి పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకని భాను అన్నారు. జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి భవన్ లో ఆదివారం బిఎస్పి పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం అసెంబ్లీ అధ్యక్షులు వాసాల రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాబోవు పార్లమెంట్ ఎలక్షన్స్ లో అనుసరించాల్సిన విధానం గురించి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి నాయకులను, కార్యకర్తలను సమాయత్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకని భాను, పార్లమెంట్ ఇంచార్జీ దాసరి ఉష, రాష్ట్ర కార్యదర్శి దొడ్డే సమ్మయ్య, మహిళా రాష్ట్ర కన్వీనర్ శిరీష, జోనల్ కన్వీనర్ జన్ను స్వరూప, జిల్లా కన్వీనర్ మిడిదొడ్డి స్వప్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎస్పి పార్టీ అభ్యర్థిని గెలిపించి కరీంనగర్ నుండి పార్లమెంట్ కు పంపాలని అన్నారు. ఎన్నికల యుద్ధంలో ముందుంటామని, బహుజన సమాజ్ పార్టీని పార్లమెంట్‌కు పంపే విధంగా శక్తి వంచన లేకుండా ఆర్ఎస్పి నాయకత్వంలో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ మంద బాలన్న, జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్, జిల్లా కార్యదర్శులు మారపల్లి మొగిలయ్య, ఇంచార్జీ శ్రీనివాస్, అసెంబ్లీ కమిటి నాయకులు, 5 మండలాల నాయకులు, సెక్టర్ బూత్ గ్రామ నాయకులు, యువకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వీణవంకలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

వీణవంక, ప్రభాత వార్త:



వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 1998 - 99 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను, గురువులు నేర్పిన క్రమశిక్షణను గుర్తు చేసుకుని స్నేహితులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో గురువులు రాజిరెడ్డి, సుధాకర్, సత్తయ్య, విద్యాసాగర్, సాంబయ్య, శ్యామ్ రావు, నాగభూషణం, కేదారేశ్వర, వెంకట రాజంతో పాటు విద్యార్థులు ప్రవీణ్, సునీల్, కుమార్ తో పాటు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# టిఆర్‌నగర్‌లోని ప్రతి సమస్యను పరిష్కరిస్తా

## టిఆర్‌నగర్ మినీ భారతదేశంఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :

ఇంటింటికి త్రాగునీరు,ప్రతి వీధిలో మురికి కాలువ సిసిరోడ్డు వేసి,అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.కొంతమంది కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చుతామని అంటున్నారు.ప్రజలు ఐదేళ్ల కోసం ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు వారేవరనీ నిలదీసిన ఎమ్మెల్సీ.బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్ కొండా శ్రీనివాస్,కొండా శారద కుల సంఘాల నాయకులు యువకులు,మహిళలు.కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.ఏ సమస్య ఉన్న నేరుగా నా ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ .జగిత్యాల మున్సిపల్ పట్టణంలోని టిఆర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్ కొండా శ్రీనివాస్,కొండా శారద,కుల సంఘాల నాయకులు,మహిళలు,యువకులు,పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్బంగా కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్‌పార్టీ జెండా ఆవిష్కరించారు.టిఆర్‌నగర్ అంగన్వాడీ స్కూల్,ప్రభుత్వ పాఠశాల,రోడ్లు,సబ్ స్టేషన్,తాగునీటి పైపు ఏర్పాటు చేసి ,తాగునీటి సమస్య పరిష్కరించారు.టిఆర్‌నగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని ప్రజలు గుర్తు చేసుకున్నారు.అనంతరం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో ఇళ్లులేని నిరుపేదలకు నర్సింగ్‌పూర్ గ్రామ శివారులోని భూమి సేకరించి,టిఆర్‌నగర్ ఏర్పాటు చేసినం.ఐక్యతను నిదర్శనం మినీ భారతదేశం టిఆర్ నగర్.టిఆర్‌నగర్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరుచేస్తాం.తాగునీటి సమస్య పరిష్కారం కోసం బావులు తవ్వించి ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసినం.అన్నివర్గాల విద్యార్థుల కోసం తెలుగు,ఇంగ్లీష్,ఉర్దూ మీడియం పాఠశాలలు ఏర్పాటు చేసినం.అర్బన్ కాలనీ



సందర్శించి,సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తాం.మురికి కాలువలు నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు.ఆరు నెలల్లో టిఆర్‌నగర్‌లో ప్రతి సమస్య పరిష్కరిస్తామని అన్నారు.బిడిలు చేసే కార్మికులకు అందరికీ 4000 పెన్షన్ ఇప్పినస్తాం.వివాహం అయిన ప్రతి మహిళలకు రూ.2500 పెన్షన్ అందిస్తామన్నారు.విద్యుత్ 200 యూనిట్ల వరకు కరెంటు బిల్లు మాఫీ అమలు చేస్తామని,ప్రతి ఇంటికి రూ.500 లకే సిలిండర్ అందిస్తామని,ఉగాది పండుగ నాటికి రేషన్‌కార్డులు అందిస్తామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంను జనం ఓటేసి ఎన్నుకున్నారు.కొంతమంది కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చుతామని అంటున్నారు.ప్రజలు ఐదేళ్ల కోసం ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు వారెవరనీ నిలదీశారు.కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధిగా టిఆర్‌నగర్ అభివృద్ధికి బాధ్యత తీసుకుంటాను.ఏ సమస్య ఉన్న నేరుగా నాకు ఫోన్ చేయండి మే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జున్నా రాజేంధర్,సిరాజ్,రాజిరెడ్డి,రవి,శ్రీనివాస్,తిరుపతి,నరేష్,సురేంధర్,పాల్గొన్నారు.

# 2003 - 2006 ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

జమ్మికుంట, ప్రభాత వార్త:



జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం 2003 - 2006 వ సంవత్సర డిగ్రీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాంబశివ రావు, శ్రవణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మికుంట డిగ్రీ కళాశాల ఆ రోజుల్లోనే విద్యార్థులందరికి మేధో కేంద్రంగా నిలిచిందని వారు కొనియాడారు. ఈ కళాశాల నుండి అనేక మంది విద్యావంతులు, మేధావులు తయారు చేసిన ఘనత ఈ కళాశాలదని వారు గుర్తు చేశారు. ఆనాటి తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఘనత ఈ కళాశాలకు చెందిన విద్యార్థులు అని వారు గుర్తు చేశారు. పూర్వ విద్యార్థులు ఎప్పుడు కలిసిమెలిసి ఉండాలని, కష్టసుఖాలలో పాలుపంచుకోవాలని వారు సూచించారు. ఎంత ఎత్తు ఎదిగినప్పటికి కూడా ఆనాటి మిత్రులను మర్చిపోవద్దని వారు సూచించారు. సమాజం మంచి చెడులు నిర్ణయించేది తరగతి గది అని వారు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కళాశాల చరిత్ర గొప్పదని వారు కొనియాడారు. విద్యార్థి దశ అనేది జీవితంలో చాలా గొప్ప సందర్భమని, ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు వివిధ రంగాలలో స్థిరపడ్డారని వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జమ్మికుంట జడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యాం, సంతోష్, తాజుద్దీన్, శివకృష్ణ, రమేష్, ప్రభాకర్, శ్రీనివాస్, లక్ష్మణ్, నాగరాజ్, రజిత, సంపూర్ణ, సునీత, విజయ, గీతారెడ్డి, ఇతర అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన క్రికెట్ టోర్నీ విజేతగా నిలిచిన వేములవాడ జట్టు

ధర్మపురి,ప్రభాతవార్త :

ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో గత 20 రోజుల నుండి బొప్పు వెంకటేష్,పోతురాజుల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోల్ల కిషన్ స్మారక క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది.ఫైనల్ పోటీ వేములవాడ జట్టుకు నేరెళ్ల జట్టుకు మధ్య జరగగా వేములవాడ జట్టు విజయం సాధించింది.నేరెళ్ల జట్టు రన్నరప్‌గా నిలిచింది.విజయం సాధించిన జట్టుకు స్థానిక సిఐ రాంనర్సింహారెడ్డి చేతుల మీదుగా రూ.50 వేలు నగదు బహుమతితో పాటు శీల్డులను పంపిణీ చేశారు.రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.25 వేలు నగదుతో పాటు శీల్డులను అందించారు.ఈ సందర్బంగా సిఐ మాట్లాడుతూ ఇంత పెద్ద టోర్నమెంట్‌ను ఒక గ్రామంలో నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు.క్రీడల ద్వారా



స్నేహభావం పెరుగుతుందని అన్నారు.తుది పోరులో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సంగనబట్ల దినేష్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందేని మొగిలి స్థానిక నాయకులు కమలాకర్,శరత్,శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తా

## ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి,ప్రభాతవార్త :

గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వ పక్షాన కృషి చేస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు.ధర్మపురి మండలం గోవింద్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ నేరెళ్ల ,గోవింద్‌పల్లి,గ్రామాలకు సంబంధించి ఏదేని సమస్యలు ఉన్నట్లయితే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యురాలు బత్తిని అరుణ,గ్రామ సర్పంచ్



రాజయ్య,కాంగ్రెస్‌పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సంగనబట్ల దినేష్,కాంగ్రెస్‌పార్టీ నాయకులు,బాలగౌడ్,మల్లేశం,రమేష్, పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారు
- లింగగిరి చెరువుకు లిఫ్ట్ ఏర్పాటు చేయిస్తా
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హుజూర్‌నగర్‌రూరల్ జనవరి 28 ప్రభాతవార్త :** గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పులమయంగా మారిందని, మాజీ సిఎం కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని రూ.6లక్షల 70వేల కోట్లు అప్పుల పాలు చేశారని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ మండలపరిధిలోని లింగగిరి గ్రామంలో రూ. 20లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయితీ భవనాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసి బస్సులలో ఉచిత ప్రయాణంతోపాటు రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్య భీమా కింద వైద్య ఖర్చులకు రూ.10లక్షలు అందించే కార్యక్రమం చేపట్టామన్నారు. త్వరలోనే రూ.500లకు గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. లింగగిరి గ్రామసర్పంచ్ ఎం పిటిసిలు కోరిన విధంగా అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి రూ.30లక్షలు, హిందు స్మశానవాటికకు రూ.5లక్షలు, ముస్లిం స్మశానవాటికకు రూ.5లక్షలు త క్షణమే ఎన్‌ఆర్‌ఈజిఎస్ నిధులనుండి మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. లింగగిరితోపాటు శ్రీనివాసపురం, లక్కవరం గ్రామరైతులు సాగు చేసుకుం టున్న పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించిన లింగగిరి చెరువుకు నూతన ఎత్తిపోతలపథకం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశిం చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అత్యధిక ఎంపి సీట్లు గెలిచి దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందన్నారు. అనంతరం లబ్దిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్య క్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసిల్దార్ నాగార్జునరెడ్డి, ఎంపిడిఓ లావణ్య, గ్రామ సర్పంచ్ కర్నాటి అంజిరెడ్డి, ఎంపిపి గూడెపు శ్రీనివాస్,ఎంపిటిసిలు వల్లభనేని విజయలక్ష్మి, ముడెం గోపిరెడ్డి, కాశమ్మ, మచ్చ వెంకటే శ్వర్లు, దొంగరి వెంకటేశ్వర్లు, నిజాముద్దీన్, దొంతగాని శ్రీనివాస్, వల్లపుదాసు కృష్ణ, సైదామేస్త్రి, కుంట సైదులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీలు

ప్రభాతవార్త, సూర్యాపేట

జిల్లాలో పలు పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న ఎస్ఐలను బదిలీ చేస్తూ ఆదివారం పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట విఆర్‌లో ఉన్న ఎన్. బాలునాయక్‌ను సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. డిఐజి జోన్ – 5 యాదాద్రిలో ఉన్న పి. వెంకటరెడ్డిని చివ్వెంల పోలీస్ స్టేషన్‌కు, సూర్యాపేట వన్‌టౌన్‌లో పనిచేస్తున్న మహేంద్రనాథ్‌ను అర్వపల్లి పోలీస్ స్టేషన్‌కు, సూర్యాపేట డిఎస్‌బిలో ఉన్న పి. మధును మద్దిరాల పోలీస్ స్టేషన్‌కు నల్లగొండ డిఎస్‌బిలో ఉన్న కె. సత్యనారాయణను తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు నడిగూడెం ఎస్ఐగా పనిచేస్తున్న ఎం. ఏడుకొండలును తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌కు నాగారం ఎస్ఐగా పనిచేస్తున్న వై. సైదులును ఆత్మకూరు(ఎస్) పోలీస్ స్టేషన్‌కు సూర్యాపేట వన్‌టౌన్ ఎస్ఐగా పి. రవీందర్‌ను పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అదే విధంగా సూర్యాపేట రూరల్ ఎస్ఐ ఆర్. సాయిరాంను డిఎస్‌బి సూర్యాపేటకు చివ్వెంల ఎస్ఐ పి. విష్ణుమూర్తిని డిఎస్‌బి సూర్యాపేట, అర్వపల్లి ఎస్ఐ బి. అంజిరెడ్డిని విఆర్ సూర్యాపేట, తిరుమలగిరి ఎస్ఐ వై. ప్రసాద్‌ను విఆర్ సూర్యాపేట, ఆత్మకూరు(ఎస్) ఎస్ఐ కె. వెంకటరెడ్డిని విఆర్ సూర్యాపేట, పెన్‌పహాడ్ ఎస్ఐ ఎన్. వెంకన్నను సిసిఎస్ సూర్యాపేట కోదాడ రూరల్ ఎస్ఐ బి. సాయిప్రశాంత్‌ను సిసిఎస్ సూర్యాపేటకు, తుంగతుర్తి ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్‌ను సూర్యాపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## నేడు బీబీనగర్‌లో పర్యటించనున్న మంత్రి కోమటిరెడ్డి

బీబీనగర్, జనవరి 28 ప్రభాతవార్త

బీబీనగర్ మండలం మహాదేవపురం, గూడూరు, కొండమడుగు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిలు పాల్గొని ప్రారంభించనున్నట్లు ఆయా గ్రామాల సర్పంచులు గడ్డం బాల్‌రెడ్డి, కడెం లతా రాజేష్‌బాబు, ఉప సర్పంచ్ దండెం అనిత ప్రభాకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మహాదేవపురంలో, 12.30లకు గూడూరులో, కొండమడుగు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండ రాంతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

## వార్త కథనానికి స్పందించిన తహసిల్దార్



అధికారులను ఫీల్డ్ ఎంక్వైరీకి పంపిన ఎమ్మార్వో శంషుద్దీన్

అక్రమ రోడ్డు నిర్మాణాన్ని జెసిబితో గాతులు

ప్రభుత్వ భూములు అక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

**చింతపల్లి ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వెంకటంపేట(తీదేడు) గ్రామ శివారులో రాజ్యానాయక్ తండా నుండి తిరుమలాపురం వెళ్లే దారిలో శ్రీ వెంకటేశ్వర కాటన్ మిల్లు ఎదురుగా ఉన్న 389 సర్వే నెంబర్ ప్రభుత్వ భూములలో కొందరు అక్రమంగా నిర్మించిన రోడ్డుపై ఈనెల 26న "ప్రభుత్వ భూములు హాంఫట్...!" అనే శీర్షికతో ప్రభాత వార్త అందించిన కథనానికి చింతపల్లి ఎమ్మార్వో శంషుద్దీన్ స్పందించారు. శనివారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాదయ్యతో ఫీల్డ్ ఎంక్వయిరీ నిర్వహించి, ఆదివారం రెవెన్యూ సిబ్బందితో జేసీబీ ద్వారా ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన రోడ్డుకు గాతులు తీశారు. రెవెన్యూ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తామని ఎమ్మార్వో తెలిపారు. ప్రభుత్వ భూములకు ఆక్రమించుకుంటే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కెనాల్ వద్ద జరుగుతున్న ప్రమాదాలకు బాధ్యులెవరు?



**తుర్కపల్లి ప్రభాతవార్త:** తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామ శివారు ప్రాంతంలో శనివారం కెనాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎలగల అరవింద్ అభం శుభం ఎరుగని 20 సంవత్సరాల యువకుడు చనిపోవడంతో ఇంట్లో చేతికొచ్చిన కొడుకు మరణించాడని తల్లిదండ్రులు విలపిస్తున్న బాధను చూసి గ్రామమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. గతంలో రెండుసార్లు రెండు లారీలు అదుపుతప్పి కెనాల్‌లో పడిపోయాయి. మూడు, నాలుగు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కాలువలో పడిపోయారు. గతంలో ఒకరు మరణించగా ముగ్గురు నాలుగురికి తీవ్ర గాయాలు ఉన్నాయి. ఈ ప్రమాదాలకు బాధ్యులెవరు, సరియైన ప్లాన్ ఇవ్వకుండా బ్రిడ్జిని నిర్మాణం చేసిన ఇంజనీర్లదా, నిర్మాణం ఎలా ఉన్న పని పూర్తయితే చాలు అనే కాంట్రాక్టర్‌దా, రోడ్డు గమనాన్ని నిర్దేశించే బోర్డులు అమర్చకపోవడం ఆర్ అండ్ బి శాఖ అధికారులదా, ఇది ప్రమాద మలుపులో మితిమీరన వేగంతో ముందుచూపు లేకుండా ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులదా, ప్రజలు శ్రేయస్సును పరిశీలన చేసి పర్యవేక్షణ చేయని అధికారులదా, ప్రజాప్రతినిధులదా, ప్రమాదం అంచున ప్రయాణం చేస్తూ పట్టినట్టుగా వ్యవహరిస్తున్న ప్రజలదా, బాధ్యతారహితంగా పిల్లలను పెంచిన తల్లిదండ్రులదా, అనే అంశాన్ని ప్రతి ఒక్కరూ నెమరు వేసుకోవాల్సి వస్తుంది. అదేవిధంగా తుర్కపల్లి, వాసాలమర్రి రెండు గ్రామాల మధ్య నేషనల్ హైవే 161 రోడ్డుపై రోజు వేలకొద్దీ వాహనాలు నాగాపూర్ టు విజయవాడ వైపు వెళ్తుంటాయి. ఇట్టి కల్వర్టుపై గోడ ఆర్ అండ్ బి అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు పెట్టకపోవడంతో చాలా ప్రమాదాలు జరిగాయి. ఇప్పటికైనా ప్రభుత్వమైనా, ప్రజాప్రతినిధులైన త్వరగా స్పందించి చర్యలు తీసుకొని భవిష్యత్తులో ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు ఆశిస్తున్నారు.



# లావాణి పట్టా భూములు అన్యాక్రాంతం..

కొనుగోలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసిన రైతులు



**చింతపల్లి ప్రభాతవార్త:** చింతపల్లి మండలం తిరుమలాపురం గ్రామంలో 11 సర్వే నెంబర్‌లోని సుమారు 19 ఎకరాల లావాణి పట్టా భూములలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు 3 ఎకరాల భూమిని కొనుగోలు చేసి మా భూములలోకి వెళ్ళకుండా కడిలు నాటుతున్నారని తిరుమలాపురం గ్రామానికి చెందిన రైతులు శనివారం తహసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం అప్పట్లో మా గ్రామంలని కొందరు రైతులకు సాగు చేసుకొని జీవనం సాగించుకోవాలని లావాణి పట్టాలను అందజేసిందని, అందరం ఒకే ఊరు ఒకటే కులస్థులం కావడంతో మా పొలాలలోకి దారి లేకున్నా ఒకరి పొలంలో నుండి ఒకరం వస్తుపోతు ఉన్నాం, అయితే ఇట్టి సర్వే నెంబర్‌లో 3 ఎరాలు పట్టా కలిగిన ఒక రైతు ఒక ప్రైవేట్ వ్యక్తికి బాండ్ పేపర్‌పై ఆ పొలాన్ని అమ్ముకానికి పెట్టాడు. ఆ వ్యక్తులు ఆ భూమిని సర్వే చేయకుండా ఫినిషింగ్ కడిలు నాటడంతో మా పొలాలోకి వెళ్లడానికి దారి లేదని, మా భూములు హెచ్చుతగ్గులు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా లావాణి పట్టా భూములు క్రయ విక్రయలు చేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని మా పొలాలలోకి బాట మార్గాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. జోగు రాములమ్మ, గార్లపాటి రాములు, శెట్టిపల్లి ఇద్దయ్య, ఆకారపు దశరథ, గార్లపాటి నాగరాజు, శెట్టిపల్లి వెంకటయ్య, మరికొందరు రైతులు ఉన్నారు.